


నంది పత్రిక

మా కలం - సామాన్యుడి బలం

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162



ఎడిటర్: మహేష్ యాదవ్ | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 305 | ఆదివారం 15 - నవంబర్ - 2026 | పేజీలు : 12 | వెల-3

Published From : KURNOOL circulated at Nandyal Alluri SitharamaRaju,Anakapalli,Anantapur,Annamayya,Bapatla,Chittoor, Konaseema,East Godavari,Eluru,Guntur,Kakinada,Krishna,,NTR, Palnadu,Parvathipuram Manyam,Prakasam,Nellore,Sri Sathya Sai,Srikakulam,Tirupati,Visakhapatnam,Vizianagaram,West Godavari, YSR Kadapa,Hyderabad,Ranga Reddy,Medchal-Malkajgiri,Warangal,Hanamkonda,Nizamabad,Karimnagar, Khammam,

రాప్తాడు విద్యార్థినికి ప్లాస్టిక్ సర్జరీ విజయవంతం: లోకేశ్



బాలికను త్వరలో ఐసీయూ నుంచి జనరల్ వార్డుకు తరలించనున్న వైద్యులు
ఆమె ఆరోగ్యంపై వివరాలు వెల్లడించిన మంత్రి లోకేశ్
బాధితురాలి వైద్య ఖర్చులను పూర్తిగా భరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

మెగాస్టార్ చిరంజీవిని కలిసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



నషా ముక్త్ భారత్ కార్యక్రమానికి చిరంజీవికి ఆహ్వానం
నవంబర్ 25 నుంచి 27 వరకు వాక్ నిర్వహణ
డగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం కలిసి నడవాలని పిలుపు
సోషల్ మీడియా వేదికగా వివరాలు వెల్లడించిన కిషన్ రెడ్డి

హైదరాబాద్‌లో మెగాస్టార్ చిరంజీవితో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి భేటీ అయ్యారు. దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలన కోసం చేపడుతున్న ప్రచారంలో భాగంగా నగరంలో నిర్వహించనున్న 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' కార్యక్రమానికి రావాల్సిందిగా

పంచాయతీ ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దు..

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి చారిత్రక విజయాన్ని అందించారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పార్టీ ముఖ్యనేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 94 మున్సిపాలిటీల్లో, 3,235 వార్డుల్లో ఎన్డీఏ అభ్యర్థులు ఘన విజయం సాధించారని తెలిపారు. అలాగే 575 జడ్పీటీసీ స్థానాలు, 7,500 కంటే ఎక్కువ ఎంపీటీసీ స్థానాల్లో కూటమి నిలబెట్టిన అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారని వివరించారు. ఈవీఎంలు అయినా, బ్యాలెట్ పేపర్లు అయినా, చివరకు పోస్టల్ బ్యాలెట్లలోనైనా ప్రజలు కూటమికే సంపూర్ణ మద్దతు పలికారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వల్లే గతంతో పోలిస్తే కూటమికి ఓటు బ్యాంకు ఏకంగా 25 శాతం పెరిగిందని చంద్రబాబు తెలిపారు. ఉద్యోగులంతా ప్రభుత్వ విధానాలకు మద్దతుగా నిలిచారని, వైసీపీ తప్పుడు ప్రచారాలను ప్రజలు ఏమాత్రం నమ్మలేదని పేర్కొన్నారు. సుమారు 7 జిల్లాల్లో కూటమి క్లీన్ స్వీప్ చేసిందని, ముఖ్యంగా అనకాపల్లి, మార్కాపురం జిల్లాల ప్రజలు 100 శాతం స్ట్రైక్ రేట్ ఇచ్చారని గుర్తుచేశారు. పోలవరం ఎడమ కాల్వ ద్వారా అనకాపల్లికి నీటిని అందించడం, మార్కాపురం కొత్త జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్-1 ఫలాలు ఈ ఫలితాల్లో స్పష్టంగా ప్రతిబింబించాయని విశ్లేషించారు.




గుడి కట్టడానికి సర్పంచ్ పదవి వేలం.. రూ. 29 లక్షలు పలికిన పోస్ట్



అనంతపురం జిల్లాలో సర్పంచ్ పదవికి వేలం పాట
రూ. 29 లక్షలకు అమ్ముడైన సర్పంచ్ పోస్ట్
రామాలయ నిర్మాణం కోసమే ఈ నిర్ణయం
పదవిని దక్కించుకున్న టీడీపీ నేత బి. నారాయణ
ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకోనున్న గ్రామస్థులు

చంద్రబాబు 'మసాలా' వ్యాఖ్యలపై భగ్గుమన్న విజయ్ పార్టీ టీవీకే..



విశాఖ సీఐఐ సదస్సులో చంద్రబాబు వ్యాఖ్యలపై వివాదం
మీకు మసాలా కావాలి, మాకు ఫలితాలు కావాలి అంటూ చంద్రబాబు వ్యాఖ్యలు!
చంద్రబాబు వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన విజయ్ నేతృత్వంలోని టీవీకే
తమిళనాడు పారిశ్రామిక ప్రగతి తరతరాల శ్రమ ఫలితమన్న సత్యకుమార్
2027 దావోస్ సదస్సు వేదికగా ఫలితాలు తేల్చుకుందామంటూ బహిరంగ సవాల్
పెట్టుబడులు ఉద్యోగాల కల్పనలో

విశాఖపట్నంలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన "మసాలా" వ్యాఖ్యలు ఇప్పుడు రెండు పొరుగు రాష్ట్రాల మధ్య పారిశ్రామిక, రాజకీయ చర్చకు దారితీశాయి. తమిళనాడుపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన విషయంలో ఏ రాష్ట్రం ముందుందో 2027 దావోస్ ప్రపంచ ఆర్థిక వేదికపై తేల్చుకుందామంటూ

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఫైనల్ ఛార్జ్‌షీట్..



ఫోన్ ట్యాపింగ్ కేసులో తుది ఛార్జ్‌షీట్ సిద్ధం చేస్తున్న సిట్
కేసీఆర్‌ను ఏ1, కేటీఆర్‌ను ఏ2గా పేర్కొనేందుకు సన్నాహాలు
ఫోరెన్సిక్, సాంకేతిక ఆధారాలతో పటిష్ఠంగా ఛార్జ్‌షీట్ రూపకల్పన
ఎలక్టోరల్ బాండ్ల కోసం బెదిరింపుల ఆరోపణలపై కీలక వాంగ్మూలం



ఖమ్మంలో కొత్తగా 3,244 మందికి పింఛన్లు!

వచ్చే నెల 1 నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ
మంజూరు పత్రాలతో పాటు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
డిసెంబర్ 9న సీఎం రేవంత్‌రెడ్డి ఖమ్మం పర్యటన..
ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించాలని అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం 2లో

ఎన్నికల్లోనూ అక్రమాలు..

ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారు..

రాజకీయాల్లో ఫాసిస్టులకు చోటు లేదని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఫాసిస్టుల వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థలు ధ్వంసమవుతున్నాయని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో ఆయన ప్రసంగించారు. గత పదేళ్లుగా ఫాసిస్టుల గొంతు గట్టిగా వినిపిస్తోందని, ప్రజాస్వామ్య సంస్థలపై దాని ప్రభావం పడుతోందనిఆరోపించారు.రాజకీయాలంటే గట్టిగా మాట్లాడటం, ఘాటైన విమర్శలు చేయడం మాత్రమే కాదని రాహుల్ అన్నారు. 2014 ఎన్నికల్లో వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని, అప్పుడే భారత ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతిందని వ్యాఖ్యానించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. మహారాష్ట్రలో లోక్‌సభ


2లో

ఎన్నికల్లో యూపీఏ కూటమి ఎక్కువ స్థానాలు గెలుచుకున్నప్పటికీ, మూడు నెలల వ్యవధిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిందని గుర్తుచేశారు. మూడు నెలల్లోనే 70 లక్షలకు పైగా ఓట్లు అదనంగా నమోదయ్యాయని, ఆ ఓట్ల కారణంగానే బీజేపీ విజయం సాధించిందని రాహుల్ ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు దెబ్బతింటున్నప్పటికీ, మనం ప్రజాస్వామ్య దేశమని గొప్పగా చెప్పుకుంటున్నామని విమర్శించారు. హైదరాబాద్, బెంగళూరులో

కవిత పార్టీ రేవంత్ రెడ్డి కోసం పని చేస్తోంది:



టీఆర్ఎస్ అంటే 'తెలంగాణ రేవంత్ సైన్యం' అన్న ప్రవీణ్ కుమార్
కాంగ్రెస్‌కు మరో అనుబంధ సంస్థలా కవిత పార్టీ పని చేస్తోందని విమర్శ
రేవంత్ రెడ్డికి రక్షణ కవచంలా కవిత వ్యవహరిస్తున్నారని ఆరోపణ 2లో

మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పార్టీపై బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కవిత నేతృత్వంలోని ఈ పార్టీ ప్రజల కోసం కాదని, కాంగ్రెస్ పార్టీకి అనుబంధ విభాగంలా పనిచేస్తోందని ఆయన ఆరోపించారు.

రాహుల్ గాంధీ హామీలన్నీ గాలి మాటలే:



గిగ్ వర్కర్లకు ఆరోగ్య భద్రత కల్పిస్తామనడం పెద్ద జోక్ అంటూ బండి సంజయ్ ఎద్దేవా
కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీలు గాలి మూటలుగా మిగిలిపోయాయని విమర్శ
గతంలో ఇచ్చిన వరంగల్, కామారెడ్డి డిక్లరేషన్ల అమలు ఏమైందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ 2లో

చంద్రబాబు 'మసాలా' వ్యాఖ్యలపై భగ్గుమన్న విజయ్ పార్టీ టీవీకే..

ఏపీ ప్రభుత్వానికి టీవీకే నేరుగా బహిరంగ సవాల్ విసిరింది.విశాఖ సదస్సులో పరిశ్రమల తరలింపు అంశంపై మీడియా అడిగిన ప్రశ్నకు చంద్రబాబు స్పందిస్తూ.. మీకు 'మసాలా' కావాలి, మాకు మాత్రం ఫలితాలు కావాలి అని చిరునవ్వుతో వ్యాఖ్యానించారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ సహజమని, పెట్టుబడిదారులకు అనుకూలమైన పరిస్థితులు ఎక్కడ ఉంటే అక్కడికే వెళతారని ఆయన పేర్కొన్నారు. పారిశ్రామిక పునాది బలపడే వరకే ఆరంభంలో ఇచ్చే రాయితీలు అవసరమని, ఆ తర్వాత వాటిని తగ్గిస్తామని చెప్పారు. తమ ప్రభుత్వ పారిశ్రామిక విధానాల వల్ల ఏపీకి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయని వివరించారు.చంద్రబాబు చేసిన ఈ వ్యాఖ్యలపై టీవీకే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆయన స్థాయికి ఇలాంటి వ్యాఖ్యలు తగవని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, సీనియర్ న్యాయవాది సత్యకుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లను ఉద్దేశించి ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. తమిళనాడు పారిశ్రామిక రంగం కేవలం ఆర్భాటం కాదని, నాణ్యమైన విద్య, సాంకేతికత, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, తరతరాల శ్రమతో నిర్మితమైందని ఆయన గుర్తుచేశారు. అటువంటి వ్యవస్థను తేలిగ్గా "మసాలా" అంటూ కొట్టిపారేయడం సరికాదన్నారు.2027 జనవరిలో జరిగే దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సు నాటికి ఏ రాష్ట్రం ఎన్ని పెట్టుబడులు సాధించింది, ఎంతమందికి ఉపాధి కల్పించిందో స్పష్టమైన లెక్కలతో చూసుకుందామని సత్యకుమార్ సవాల్ చేశారు. విజయ్ నాయకత్వంలో తమిళనాడును దేశంలోనే పెట్టుబడుల ఆకర్షణలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా సరికొత్త పారిశ్రామిక విధానాలతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. తమిళనాడు ఆత్మగౌరవం, సమాఖ్య స్ఫూర్తి, పెరియార్, అన్నాదురైల సామాజిక న్యాయ సిద్ధాంతాలపై ఆధారపడి నడుస్తుందని ఆయన పేర్కొన్నారు. తిరుక్కురళ్‌ను ఉటంకిస్తూ, తాము సిద్ధాంతాలపై రాజీపడే ప్రసక్తే లేదని, బీజేపీతో ఎలాంటి పొత్తులు లేకుండానే అభివృద్ధి సాధిస్తామని స్పష్టం చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సినీ ప్రస్థానం మద్రాసుతో ముడిపడి ఉండటం, ఎంజీఆర్‌తో ఆయనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. మాటలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో వచ్చే పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన ఫలితాల ఆధారంగానే ఎవరు ముందో తేల్చుకుందామని టీవీకే స్పష్టం చేసింది.

ఎన్నికల్లోనూ అక్రమాలు..

ఐటీ రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని రాహుల్ పేర్కొన్నారు. అదానీ వ్యాపార విస్తరణపై విమర్శలు గుప్పించారు. 12 ఏళ్ల క్రితం సంపన్నుల జాబితాలో 600వ స్థానంలో ఉన్న అదానీ, ప్రస్తుతం రెండో స్థానానికి చేరారని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన వ్యాపారం విస్తరించిందని ఆరోపించారు.

కవిత పార్టీ రేవంత్ రెడ్డి కోసం పని చేస్తోంది

కాంగ్రెస్ పార్టీకి యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ వంటి అనేక అనుబంధ సంస్థలు ఉంటాయని, టీఆర్ఎస్ కూడా అలాంటి ఒక అనుబంధ సంస్థేనని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. టీఆర్ఎస్ అంటే 'తెలంగాణ రక్షణ సేన' కాదని, 'తెలంగాణ రేవంత్ సైన్యం' అని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఈగ కూడా వాలకుండా కంటికి రెప్పలా కాపాడుతున్న సైన్యమే ఇదని, దానికి నాయకురాలు కవిత అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి సౌజన్యంతో, పాంచజన్యం ఎజెండాతోనే కవిత టీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేశారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి ఆధారాలను త్వరలోనే ప్రజల ముందుకు తెస్తానని ఆయన స్పష్టం చేశారు.

రాహుల్ గ్యాంధీ హామీలన్నీ గాలి

హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించిన గిగ్ వర్కర్ల సంక్షేమ పథకంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ నోట పలికేవన్నీ గాలి మాటలేనని ఆయన విమర్శించారు. గిగ్ వర్కర్లకు ఆరోగ్య భద్రత కల్పిస్తామని రాహుల్ గాంధీ చెప్పడం పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్, కాంగ్రెస్ పార్టీ తీరుపై నిప్పులు చెరిగారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు ఇప్పటివరకు గాలి మూటలుగానే మిగిలిపోయిన మాట వాస్తవం కాదా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన వరంగల్, కామారెడ్డి డిక్లరేషన్‌ల అమలు ఏమైందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత హామీలను నెరవేర్చకుండా పక్కనపెట్టేసి, ఇప్పుడు కొత్తగా మరో హామీ ఇవ్వడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఆరోగ్యశ్రీ పథకానికి నిధులు సరిగ్గా కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ఇచ్చిన హెల్త్ కార్డులు కూడా ఆసుపత్రులలో సరిగ్గా పనిచేయడం లేదని ఆయన గుర్తుచేశారు. ఉన్న పథకాలకే దిక్కులేకుండా చేసి, కొత్తగా గిగ్ వర్కర్లకు బీమా, ఆరోగ్య భద్రత కల్పిస్తామంటే ఎవరూ నమ్మే పరిస్థితుల్లో లేరని సంజయ్ స్పష్టం చేశారు.

అభ్యుదయ కూటమిపై క్యాపిటలిస్టుల దుష్ప్రచారం

అభ్యుదయ రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా క్యాపిటలిస్టులు.. పెయిడ్ మీడియా, ఏఐ ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని, దీనిని ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువ కావాలని వక్తలు సూచించారు. 'భారత్ సమ్మిట్' రెండో రోజు 'ప్రోగ్రెసివ్ నేషన్ అండ్ అకౌంటబిలిటీ' అంశంపై జరిగిన చర్చలో ఫిన్లాండ్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ మాజీ వైస్ ప్రెసిడెంట్ అంటన్ రోన్‌హల్మ్, ఉరుగ్వే సోషలిస్ట్ పార్టీ సెక్రటరీ జనరల్ పాబ్లో ఓర్సి, థాయ్‌లాండ్ పీపుల్స్‌పార్టీ అడ్వైజర్ పెనగనార్ బూన్‌క్లుమ్, ఎఫ్ఈపీఎస్ డెమొక్రసీ హెడ్ క్రిస్టియన్ స్లామ్ తదితరులు పాల్గొని కీలక ప్రసంగాలు చేశారు. సోషల్ మీడియాలో నకిలీ సమాచారం వేగంగా వైరల్ అవుతోందని.. తప్పుడు సమాచారమని నిర్ధారించేలోపే ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తోందన్నారు. అధికారంలో ఉన్న పార్టీలు ఎన్నికల అక్రమాలకు పాల్పడుతున్నా, ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నా స్పందన ఉండటం లేదని విమర్శించారు.

సమాచార విస్తృతి పెరుగుతోంది.. విశ్వసనీయత తగ్గుతోంది!

సమాచార విస్తృతి పెరుగుతున్నప్పటికీ విశ్వసనీయత తగ్గుతోందని, ఏఐ రాకతో అసలైన సమాచారాన్ని గుర్తించడం కష్టంగా మారిందని వక్తలు అభిప్రాయపడ్డారు. భారత్ సమ్మిట్‌లో 'ఫ్యూచర్ ఆఫ్ మీడియా' అంశంపై జరిగిన చర్చలో జర్మనీకి చెందిన లియోనార్డ్ నావీ, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు సంగీతా బారువా పిషరోటీ, ఇటలీకి చెందిన ఫ్రాన్సిస్కో లపెంటా తదితరులు ప్రసంగించారు. ప్రకటనల ఆదాయం డిజిటల్ వేదికలకు మళ్లడంతో స్థానిక వార్తా సంస్థల మనుగడ కష్టమవుతోందన్నారు. ఏ సమాచారం ప్రజలకు కనిపించాలనే అంశాన్ని కూడా డిజిటల్ వేదికలే ప్రభావితం చేస్తున్నాయని... ఏఐతో తప్పుడు సమాచారం, డీప్‌ఫేక్‌ల ముప్పు పెరుగుతోందన్నారు. సమాచారానికి కొరత లేదని, దాని నిజానిజాలను నిర్ధారించడమే సమస్యగా మారిందని.. మీడియా సంస్థలు కంటెంట్ సృష్టికర్తలు, ప్రజలతో భాగస్వామ్యం కావాలని సూచించారు.

అగ్రరాజ్యాల ఆగడాలను అడ్డుకోవాలి
ఇందుకు చిన్న దేశాలు కూటమిగా ఏర్పడాలి

అగ్రరాజ్యాలు ఇతర దేశాలపై చేస్తున్న దాడులు, బలప్రయోగాలను అడ్డుకునేందుకు చిన్న దేశాలు కూటమిగా ఏర్పడి,కార్యాచరణ రూపొందించుకోవాలని వక్తలు సూచించారు. 'పీస్ ఇన్ ద న్యూ వరల్డ్' అంశంపై జరిగిన చర్చలో ఈజిప్ట్ సెనేటర్ బాకన్ కమేల్, ఈక్వెడార్ మాజీ మంత్రి గులిమలి లాంగ్, కాంబోడియా కార్మిక మంత్రి చర్ల లాపేజ్ ఓబర్గాన్, రాజ్యసభ ఎంపీ నసీర్ హుస్సేన్, ఎఫ్ఈపీఎస్ మాజీ ప్రెసిడెంట్ మారియా జావో రోడ్రిగ్ మాట్లాడారు. రష్యా-ఉక్రెయిన్.. ఇరాన్- అమెరికా- ఇజ్రాయిల్ యుద్ధాల్లో అమాయకులైన మహిళలు, చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రరాజ్యాల దాడులను అడ్డుకోవడంలో ఐక్యరాజ్యసమితి విఫలమైందన్నారు. అంతర్జాతీయ చట్టాలను పకడ్బందీగా అమలు చేయడంతో పాటు చిన్న దేశాలు ఐక్యంగా తమ రక్షణకు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.



ఖమ్మంలో కొత్తగా 3,244 మందికి పింఛన్లు!

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పేదల జీవితాల్లో ఆర్థిక భరోసాతోపాటు ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే చేయూత పింఛన్ల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో కొత్తగా ఎంపికైన 3,244 మంది పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలతోపాటు స్మార్ట్ రేషన్ కార్డులను శనివారం స్థానిక శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో 45 లక్షలకు చేరిన పింఛన్ లబ్ధిదారులు..

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 40 నుంచి 44 లక్షల మందికి పింఛన్లు అందుతుండగా, తాజాగా మరో 4.5 లక్షల మందికి కొత్తగా మంజూరు చేయడంతో మొత్తం లబ్ధిదారుల సంఖ్య 45 లక్షలకు చేరిందన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, తలసేమియా బాధితులకు నెలకు రూ.2,016, దివ్యాంగులకు రూ.4,016 చొప్పున ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో పింఛన్ మొత్తం అధికంగా ఉందని, ఈ నగదు పేదలకు మందులు, నిత్యావసరాలు, ఇతర వ్యక్తిగత అవసరాలకు ఉపయోగపడుతోందన్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పింఛన్ నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని వెల్లడించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు.. ఇటీవల ఖమ్మం నియోజకవర్గంలో మంజూరైన 3,500 ఇందిరమ్మ ఇళ్లను క్షేత్రస్థాయి విచారణ అనంతరం గుడిసెల్లో నివసించే నిరుపేదలకు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. మిగిలిన అర్హులకు త్వరలో మరో 2 వేల ఇళ్లు మంజూరు కానున్నాయని వెల్లడించారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటి ఆరు లక్షల కుటుంబాలకు ఉచిత బియ్యం అందిస్తున్నామని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం, చేయూత పింఛన్లు, కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ వంటి పథకాలతో పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.

డిసెంబర్ 9న సీఎం ఖమ్మం పర్యటన..

ఖమ్మం నగరంలో నిర్మిస్తున్న మున్నేరు కేబుల్ బ్రిడ్జి, నూతన మిర్చి మార్కెట్, వెలుగుమట్లలో పేదల ఇళ్లు, ప్రభుత్వ మెడికల్ కాలేజీ తదితర అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు డిసెంబర్ 9న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమాల నాటికి పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రధాన రహదారుల వెంట నిర్మించిన ఫుట్‌పాత్‌లను ఆక్రమణలకు గురికాకుండా మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఆక్రమణలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. మిగిలిన రహదారుల విస్తరణకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

సాగు, తాగునీటికి ముందస్తు చర్యలు..

ఎల్‌నినో ప్రభావంతో నాగార్జునసాగర్, గోదావరి ప్రాజెక్టులకు ఆశించిన స్థాయిలో నీరు రాక ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడినప్పటికీ.. గోదావరి జలాలను తరలించి సాగర్ ఆయకట్టు కింద 2.5 లక్షల ఎకరాల పంటను కాపాడగలిగామని మంత్రి తెలిపారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలు, చెరువులు, రహదారుల నష్టాన్ని అంచనా వేసి పునరుద్ధరణ చర్యలు చేపడతామన్నారు. ఖమ్మం నగరంలో ప్రస్తుతం ఉన్న నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తాం: కలెక్టర్

జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు సుమారు 1.70 లక్షల మందికి వివిధ రకాల పింఛన్లు అందుతున్నాయని తెలిపారు. గత మూడు, నాలుగు సంవత్సరాల తర్వాత ఇంత పెద్ద ఎత్తున కొత్త పింఛన్లు మంజూరు చేయడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటికే 25 వేల మంది పింఛన్లు పొందుతుండగా, తాజాగా మరో 3,244 మందికి మంజూరు చేసి అర్హత పత్రాలు అందిస్తున్నట్లు వివరించారు.గతంలో మాదిరిగా ప్రాంతాల వారీగా పరిమితులు విధించకుండా, దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలన్నది ప్రభుత్వ నిర్ణయమని స్పష్టం చేశారు. ప్రజావాణికి వచ్చే దరఖాస్తుల్లో 30 నుంచి 40 శాతం పింఛన్లకు సంబంధించినవేనని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తున్నామని తెలిపారు. పింఛన్ పొందుతున్న వృద్ధులు మరణిస్తే వారి జీవిత భాగస్వామికి కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఆటోమేటిక్‌గా పింఛన్ బదిలీ అయ్యే విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. అర్హత ఉన్నప్పటికీ జాబితాలో పేరు లేనివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తు చేసుకుంటే విచారణ జరిపి తదుపరి విడతలో పింఛన్ మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు.

లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు: కమిషనర్

ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ కొత్తగా ఎంపికైన పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించే కార్యక్రమాన్ని క్రమబద్ధంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా క్షేత్రస్థాయిలో పరిశీలన, పర్యవేక్షణ కొనసాగిస్తామన్నారు. నగరంలో డ్రైనేజీ నిర్మాణాలు, పారిశుద్ధ్యం, రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ఖమ్మంను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి పింఛన్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందించాలని మంత్రి సూచించారు. నగర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, డీఆర్డీవో కె. శ్రీరామ్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ప్రజాప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమెరికా ఎన్నికల్లో సాంస్కృతిక పోరాటాల్లేవ్ !

అమెరికాలో జరిగిన మధ్యంతర ఎన్నికలు 'తప్పులు సరిదిద్దుకోవటం'లో ప్రజాస్వామ్యానికున్న బలాన్ని చాటాయి. చాలామంది ఊహించినదానికంటే ఎక్కువ మార్పునే అమెరికా ఓటర్లు చూపారు. అధ్యక్షుడు తాననుకున్నది చేయటానికి కాంగ్రెస్‌లో మెజారిటీ కీలకం. లేదంటే విదేశీ విధానాల్లో, రక్షణ, దేశ భద్రత విషయాలలో తప్ప ఎగ్జిక్యూటివ్ ఆదేశాల ఫలితాలు పరిమితంగా ఉంటాయి. తాజా ఎన్నికల తర్వాత ప్రతినిధుల సభలో డెమోక్రాటిక్ పార్టీ భారీ మెజారిటీ సాధించింది. సెనేట్‌లోనూ దాని ఆధిక్యం గణనీయంగా పెరిగింది. అధ్యక్షుడి రెక్కలు కత్తిరించారు ప్రజలు. అటు ప్రతినిధుల సభ, ఇటు సెనెట్ రెండింటి లోనూ అధికార పార్టీకి భారీ వ్యతిరేకత వ్యక్తమవటం చాలా అరుదు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 1946, 1994, 2010లో మాత్రమే అలా జరిగింది.సరిహద్దుల్ని కట్టుదిట్టం చేసి, అక్రమ వలసల్ని ఆపుతారనే నమ్మకంతోనే ట్రంప్‌కి చాలామంది సంప్రదాయ డెమోక్రాట్ ఓటర్లు మద్దతిచ్చారు. కానీ దాన్ని క్రూరంగా, మానవ హక్కుల ఉల్లంఘనలా, ఆయా దేశాల్లో ఎన్నికైన ప్రభుత్వాధినేతల్ని అవమానించేలా మార్చి ట్రంప్

పంచాయతీ ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దు..

రాబోయే రోజుల్లో జరగనున్న మరో 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు తిరుగులేని విజయం సాధించాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ ఎన్నికలను ఏమాత్రం తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. గ్రామాల్లో కూడా కూటమి బలపరిచే అభ్యర్థులే గెలవాలని, క్షేత్రస్థాయిలో ప్రజల ఆదరణ ఉన్న మంచి వ్యక్తులను, విద్యావంతులను, యువతను ప్రోత్సహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సరైన నాయకులను తీర్చిదిద్దుకోవడానికి ఈ ఎన్నికలు చక్కటి అవకాశమని, రాబోయే 30 ఏళ్లకు ఉపయోగపడేలా బలమైన నాయకత్వాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రం, రాష్ట్రం, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్‌లలో ఇప్పటికే ఎన్డీఏ అధికారంలో ఉందని, పంచాయతీల్లోనూ మన అభ్యర్థులు గెలిస్తే పాలన, అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా, సజావుగా ముందుకు సాగుతాయని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా పనిచేసినంత కాలం వారు మన వెంటే ఉంటారని స్పష్టం చేశారు. కొందరు కావాలనే హింసను నమ్ముకుంటారని, కానీ కూటమి పూర్తిగా ప్రజాస్వామ్యాన్ని మాత్రమే నమ్ముతుందని చెప్పారు. నాయకులెవరూ ఎట్టి పరిస్థితుల్లోనూ గొడవలకు పోవద్దని, చెడ్డ పేరు తెచ్చుకోవద్దని గట్టిగా హెచ్చరించారు. అధికారాన్ని కేవలం ప్రజలకు మంచి చేయడానికి, వారికి మరింత చేరువ కావడానికి మాత్రమే ఉపయోగించుకోవాలని సీఎం హితవు పలికారు. గెలిచిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

రాష్ట్రాడు విద్యార్థినికి ప్లాస్టిక్ సర్జరీ విజయవంతం: లోకేశ్

రాష్ట్రాడు విద్యార్థినికి నిర్వహించిన మరో ప్లాస్టిక్ సర్జరీ విజయవంతమైందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన 'ఎక్స్' వేదికగా ఈ వివరాలను వెల్లడించారు. బాలికకు కుట్లు తీసివేసి, గాయాన్ని శుభ్రపరిచి తిరిగి కుట్లు వేసే ప్రక్రియ (డీబ్రిడ్‌మెంట్, రీ-సూ్యచరింగ్) పూర్తయిందని పేర్కొన్నారు. ఆమెను త్వరలోనే ఐసీయూ నుంచి జనరల్ వార్డుకు తరలించనున్నట్లు వివరించారు. కొన్ని రోజులుగా ఆమె వెంటిలేటర్ సాయం లేకుండానే శ్వాస తీసుకుంటోందని, ప్రస్తుతం ద్రవ ఆహారం కూడా ఇస్తున్నారని మంత్రి లోకేశ్ తెలిపారు. తాజాగా శనివారం నిర్వహించిన సర్జరీతో ఆమె కోలుకోవడంలో మరో ముందడుగు పడినట్లయింది. బాధితురాలి వైద్య ఖర్చులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.

మెగాస్టార్ చిరంజీవిని కలిసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

చిరంజీవిని ఆయన సొదరంగా ఆహ్వానించారు. ఈ మేరకు భేటీ వివరాలను కిషన్ రెడ్డి తన అధికారిక సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు.మాదకద్రవ్యాల మహమ్మారి బారిన పడకుండా యువతను కాపాడుకునేందుకు, హైదరాబాద్‌తో పాటు తెలంగాణ, యావత్ భారతదేశాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. నవంబర్ 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్ నగరంలో 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' పేరుతో ఈ భారీ వాక్‌థాన్ జరగనుంది. మాదకద్రవ్యాల వ్యసనానికి వ్యతిరేకంగా సాగుతున్న ఈ పోరాటంలో హైదరాబాద్ ప్రజలను, ముఖ్యంగా యువతను చైతన్యపరచడానికి చిరంజీవి తమతో కలిసి రానున్నారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో చిరంజీవికి ఉన్న విశేష ఆదరణ ద్వారా యువతలో విస్తృత అవగాహన తీసుకురావడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. డ్రగ్స్ లేని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రజలందరూ ఈ ఉద్యమంలో ఐక్యంగా భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

గుడి కట్టడానికి సర్పంచ్ పదవి వేలం.. రూ. 29 లక్షలు పలికిన పోస్ట్

అనంతపురం జిల్లాలో ఒక ఆసక్తికర ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామంలో రామాలయ నిర్మాణం కోసం సర్పంచ్ పదవినే వేలం వేసి, తద్వారా వచ్చిన నిధులను గుడి కోసం వినియోగించాలని గ్రామస్థులు నిర్ణయించారు.వివరాల్లోకి వెళితే.. గార్లదిన్నె మండలం, కప్పల బండ గ్రామ పంచాయతీలో ఈ సంఘటన జరిగింది. గ్రామంలో ఇప్పటివరకు గుడి లేదు. సుమారు రూ. 20 లక్షల ఖర్చుతో శ్రీరాముడి ఆలయం నిర్మించాలని గ్రామ పెద్దలు ఎప్పటినుంచో భావిస్తున్నా, వరుస కరువులు, ఇతర కారణాల వల్ల అది సాధ్యపడలేదు. ఈ నేపథ్యంలో రాబోయే పంచాయతీ ఎన్నికలను గ్రామస్థులు ఒక అవకాశంగా మలుచుకున్నారు.సర్పంచ్ పదవి కోసం నిర్వహించిన ఈ వేలం పాట రూ. 20 లక్షలతో ప్రారంభం కాగా, టీడీపీకి చెందిన నేత బి. నారాయణ అత్యధికంగా రూ. 29 లక్షలు పలికి పదవిని దక్కించుకున్నారు. ఎన్నికల వల్ల వచ్చే గొడవలు, ఉద్రిక్తతలను నివారించేందుకు, అలాగే ప్రభుత్వాన్ని నుంచి ఏకగ్రీవ ప్రోత్సాహకాలను అందుకునేందుకు గ్రామస్థులంతా కలిసి ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో బి. నారాయణను ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నుకోవడానికి అంగీకరించారు. ఈ వేలం పాట గురువారం జరగ్గా, దీనికి సంబంధించిన వీడియోలు శనివారం సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో విషయం బయటకు వచ్చింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఫైనల్ ఛార్జ్‌షీట్..

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుంది. ఈ కేసులో నాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు (కేసీఆర్)ను ప్రధాన నిందితుడిగా (ఏ1), ఆయన కుమారుడు, మాజీ మంత్రి కేటీఆర్‌ను రెండో నిందితుడిగా (ఏ2) పేర్కొంటూ తుది ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. చట్టవిరుద్ధమని తెలిసినప్పటికీ ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతులు ఇచ్చారని, తమకు అనుకూలంగా ఉండే అధికారులను ఇంటెలిజెన్స్, ఎస్ఐబీ వంటి కీలక విభాగాల్లో నియమించి ఈ అక్రమాలకు పాల్పడ్డారని సిట్ భావిస్తోంది. ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తలతో పాటు పలువురు సెలబ్రిటీల ఫోన్లను ట్యాప్ చేయడం వెనుక భారీ కుట్ర ఉందని దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. దీనిపై సిట్ అధికారులు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించినట్లు సమాచారం.ఈ ఆరోపణలకు బలం చేకూర్చేలా వందలాది మంది బాధితుల వాంగ్మూలాలను, బలమైన ఫోరెన్సిక్, సాంకేతిక ఆధారాలను సిట్ సేకరించింది. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారంతో బెదిరింపులకు పాల్పడి, ఎలక్టోరల

ఎమ్మెల్యే బుడ్డాకు ఆహ్వాన పత్రిక



బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 14: శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి ఓంకారం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు కార్తీక మాసం ఆహ్వాన పత్రికలను అందజేశారు. శనివారం ఎమ్మెల్యే స్వగ్రామమైన వేల్పనూరులో బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఓంకార దేవస్థానం చైర్మన్ చెన్నారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏ నాగప్రసాద్ అర్చకులు భాస్కర శర్మ తదితరులు కలిశారు. కార్తీక మాసం సందర్భంగా ఆహ్వాన పత్రికలను అందజేసి సిద్దేశ్వర స్వామి దర్శనానికి రావలసిందిగా ఎమ్మెల్యేకు ధర్మకర్త మండలి సభ్యులు విజ్ఞప్తి చేశారు.

బండి ఆత్మకూరులో బాలల దినోత్సవం



బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 14: 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం గ్రంథాలయ అధికారి ఎం .రవిరాజు ఆధ్వర్యంలో గ్రంథాలయ ప్రారంభ వేడుకలు ప్రారంభ మయ్యాయి. బాలల దినోత్సవ సంద ర్భంగా జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని, ఆయన చిత్రపటాని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ వి. గుణ సాయి తో పాటు విద్యార్థిని విద్యార్థులు, పాఠకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

షేక్ హాజీ గౌస్ ఆధ్వర్యంలో ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు



ఖాజీపేట, నంది పత్రిక నవంబర్ 14: వైఎస్ఆర్ కడప జిల్లా ఖాజీపేట బస్టాండ్ కూడలిలో ఖాజీపేట ఫ్రెండ్స్ సేవా సంఘం అధ్యక్షుడు, సూక్ష్మ నిర్మాణాల కళాకారుడు, కవి షేక్ హాజీ గౌస్ ఆధ్వర్యంలో భారత తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 137వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా షేక్ హాజీ గౌస్ మాట్లాడుతూ.. 1889 నవంబర్ 14న అలహాబాద్‌లో జన్మించిన జవహర్‌లాల్ నెహ్రూ, 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం తొలి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారని తెలిపారు. ప్రధానిగా విద్య, విజ్ఞాన శాస్త్రం, పరిశ్రమల అభివృద్ధికి విశేష ప్రాధాన్యతనిచ్చారని, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి కృషి చేసి దేశాభివృద్ధికి పునాదులు వేశారని పేర్కొన్నారు. మహాత్మా గాంధీతో కలిసి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని, ఉద్యమ సమయంలో పలుమార్లు జైలు జీవితం గడిపారని గుర్తుచేశారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. నెహ్రూకు చిన్నారులంటే ఎంతో ఇష్టమని, అందుకే పిల్లలు ఆయనను ప్రేమగా 'చాచా నెహ్రూ' అని పిలుచుకునేవారని అన్నారు. ఆయన జన్మదినమైన నవంబర్ 14ను దేశవ్యాప్తంగా బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ, రచయిత షేక్ ఇంతియాజుద్దీన్, ఈ. మొహమ్మద్ హుస్సేన్, ఓబుల్ రెడ్డి, అయ్యవారయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ వీర విధేయుల్లో లుకలుకలు.

వైస్ చైర్మన్ పదవి లొల్లి .

40 ఏళ్లుగా పార్టీకి సేవలు చేశాము...రెండు సార్లు గెలిచాం మాకు అవకాశం లేదా.

ఒక్కసారి గెలిచినవారికి వైఎస్ చైర్మెన్ పదవి ఇవ్వనున్నారా.

ఇంచార్జి మినిస్టర్ కు పిర్యాదు చేయనున్న ఆశావహులు.

నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 14 (నంది పత్రిక) నంద్యాల మున్సిపల్ ఎన్నికలు కార్యకర్తలు,గెలిచిన అభ్యర్థుల్లో లుకలుకలు మొదలయ్యాయి.ఎన్నికల్లో అధికార పార్టీ ఉన్నప్పటికీ వైసిపి కి అధిక సంఖ్యలో కౌన్సిలర్ అభ్యర్థులు గెలుపొందారు.కూటమిలో ఐక్యమత్యం,నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో మున్సిపల్,జెడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల్లో వైసిపి విజయకేతనం ఎగురవేసింది.ఈ నేపధ్యంలోనే టీడీపీ తమ్ముళ్ళ మధ్య వైఎస్ చైర్మెన్ పదవి ఆజ్యం పోస్తుంది.ఎన్నికలు ముగిసిన తర్వాత గెలుపొందిన,ఓడిన అభ్యర్థులతో నేతలు పరామర్శలు చేయలేదని కొందరు ఆగ్రహంగా ఉన్నట్టు తెలుస్తోంది.టీడీపీ నీ నమ్ముకొని లక్షలు ఖర్చుపెట్టి 40 ఏళ్లుగా పార్టీని నమ్ముకున్న వారు అన్నివిధాలుగా నష్టపోయినా పార్టీ కోసం పనిచేస్తున్నారు.ఈ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు బయటపడకుండా తమకే వైఎస్ చైర్మెన్ పదవి వస్తుందని ఆశపడ్డారు.నేతలు సైతం టిడిపి లో గెలిచిన వారికి ఎవరికి ఒక్క మాటకూడా వైఎస్ చైర్మెన్ పదవి పలానా వారికి ఇస్తామని చెప్పలేదని కొందరు ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నేతలు వారికి వచ్చిన విధంగా ప్రవర్తిస్తే పార్టీని నమ్ముకున్న వారి పరిస్థితి ఏంటి అని ప్రశ్నిస్తున్నారు.అసలే సర్పంచ్ ఎన్నికల ముందు ఇలాంటి విపత్కర పరిస్థితి నెలకొనడంతో కార్యకర్తల్లో అయోమయ పరిస్థితి నెలకొంది.గెలుపొందిన అభ్యర్థులతో మాట్లాడి వైఎస్ చైర్మెన్ పదవి ప్రకటించాలి కానీ ఇప్పటికే దాదాపు నలుగురు నుంచి ఐదు మంది వైఎస్ చైర్మెన్ పదవి మాస్క్ వస్తుందని మద్దతు ఇవ్వాలని ఒకరికి తెలియకుండా ఒకరు వచ్చిపోతుంటే అర్థం కానీ పరిస్థితి ఎదురైందని వాపోతున్నారు.గెలిచిన అభ్యర్థుల్లో కొందరు ఆశావహులు ఇంచార్జ్ మినిస్టర్ దృష్టికి తీసుకొని వెళ్లేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది.వైఎస్ చైర్మెన్ పదవి టీడీపీ కి వస్తుందా,వైసిపి కి వస్తుందా అని తెలకముందే సంద్యాల టీడీపీ లో అసంతృప్తులు మొదలయ్యాయి.ఇప్పటికే మూడు ఎన్నికల్లో టీడీపీ కంటే వైసిపి ముందంజలో ఉండడం,సర్పంచ్ ఎన్నికల్లో గెలుపు వ్యూహాలు రచించే సమయంలో వైఎస్ చైర్మెన్ లొల్లి నాయకులు ఏవిదంగా పరిష్కారం చేస్తారో అర్థం కానీ పరిస్థితి.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెహ్రూ జయంతి వేడుకలు



నంద్యాల ప్రతినిధి. నవంబర్ 13 . (నంది పత్రిక):కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారతదేశ మాజీ ప్రధానమంత్రి చాచా నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నంద్యాల పట్టణ అధ్యక్షుడు మస్తాన్ కాంగ్రెస్ నాయకుడు మౌలానా షేక్ మొహమ్మద్ ఇదిస్ జానో జాగో జాతీయ కార్యదర్శి సయ్యద్ మహబూబ్ బాషా మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర ఉద్యమంలో నెహ్రూ పాత్ర చాలా కీలకమని అనేకసార్లు జైలు జీవితం గడిపారని,ఆనాడే దేశ ప్రధానిగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని డ్యాములు ఎన్నో పథకాలు అమలు చేసి దేశాన్ని ముందుకు నడిపించారని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఇలా దిసిసి ఉపాధ్యక్షుడు పబ్బతి అబ్రహం పిసిసి డెలిగేట్ నెంబర్ రవిబాబు నంద్యాల జిల్లా మైనార్టీ నాయకుడు షేక్ గులాం హుస్సేన్ మౌలానా వలి ఉల్లా తదితరులు పాల్గొన్నారు

గురురాజు ఇంటర్నేషనల్ పాఠశాలలో ఘనంగా ముగిసిన అథ్లెటిక్స్ పోటీలు

పోటీల్లో విజేతలకు బహుమతి అందించిన డాక్టర్ దస్తగిరి రెడ్డి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, షేక్షావలి రెడ్డి



నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 14 (నంది పత్రిక)నంద్యాల జిల్లా బాబా నగర్ సమీపంలోని గురురాజా ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలు ముగిశాయి. ముగింపు అథ్లెటిక్స్ పోటీలకు శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ అధినేత డాక్టర్ పి దస్తగిరి రెడ్డి, శ్రీ రామకృష్ణ కళాశాలల అధినేత డాక్టర్ జి రామకృష్ణారెడ్డి, గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గురు రాజ ఇంటర్నేషనల్ స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలను అతిథులు పరిశీలించారు. క్రీడాకారులను ఉత్సాహపరిచేలా వారిని ప్రోత్సహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరమని క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని గుర్తు చేశారు. క్రీడలు ఆడడంతో మానసిక ఉత్సాహంతో పాటు జ్ఞాపకశక్తి పెరిగేందుకు మెదడు చురుగ్గా పనిచేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. గురు రాజా ఇంటర్నేషనల్ పాఠశాలలో రన్నింగ్ రేసు, జావిల్లింగ్ త్రో, షాట్ పుట్, డిస్కస్ త్రో, 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల ప్రత్యేక ట్రాక్ను ఏర్పాటు చేసి క్రీడాకారులకు పోటీల నిర్వహించగా విజేతలైన క్రీడాకారులకు ముఖ్యులు బహుమతులు ప్రధానం చేశారు.

జ్యోతిర్మయి హైస్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో ముందుకు సాగాలి

వయోజన విద్య ఉపసంచాలకులు కె. చంద్రశేఖర్ రెడ్డి



నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 14 (నంది పత్రిక) నంద్యాల పట్టణంలోని జ్యోతిర్మయి హైస్కూల్‌లో నవంబర్ 14వ తేదీన బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వయోజన విద్య ఉపసంచాలకులు కె. చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాదులని, ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యతో పాటు నైతిక విలువలు, సమయపాలన, పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర సృజనాత్మక రంగాల్లో కూడా ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి హైస్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, మంచి విద్యా వాతావరణంపై ఆయన ప్రత్యేకంగా ప్రశంసలు వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఇందు విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం చూపుతున్న అంకితభావం, కృషి, పట్టుదల ఎంతో అభినందనీయమని కొనియాడారు. విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, వారిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం వంటి అంశాల్లో ఆమె చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఇందు నిరంతర పర్యవేక్షణ, సమర్థవంతమైన నాయకత్వం, ఉపాధ్యాయులతో సమన్వయం కారణంగా విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లో కూడా మంచి ప్రతిభ కనబరుస్తున్నారని అభిప్రాయపడ్డారు.అదేవిధంగా పాఠశాల అభివృద్ధికి సహకరిస్తూ, విద్యార్థులకు మంచి విద్యా వాతావరణం కల్పించడంలో తోడ్పడుతున్న పాఠశాల కరస్పాండెంట్ సురేష్ ని కూడా అభినందించారు.అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఎంతో ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీ సురేష్ గారు, ప్రిన్సిపాల్ శ్రీమతి ఇందు గారు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అంగన్వాడి బడి పిల్లలకు గిఫ్ట్ లు అందజేత.



బేతంచెర్ల నవంబర్ 14 (నంది పత్రిక). బేతంచెర్ల పట్టణం వాసవి క్లబ్ వారి ఆధ్వర్యంలో 14/11/2026 వ తేదీ శనివారం,బేతంచెర్ల పట్టణం నందు గల కోటపేటలోని 4వ,6 వ,అంగన్వాడీ కేంద్రాలలో బాలల దినోత్సవమును పురస్కరించుకొని చిన్న పిల్లలకు భోజనం ప్లేట్స్, వాటర్ బ్యాటల్స్, కేక్స్ మరియు చాక్లెట్స్ పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో వాసవి క్లబ్ అధ్యక్షులు ఎం.వి.రమణ, కోశాధికారి జగన్, జివిఎస్.గుప్త, అనుముల సురేష్ బాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షులు రమణ మాట్లాడుచూ బాలల దినోత్సవం సందర్భంగా ఈ సేవా కార్యక్రమం చేయడం చాలా ఆనందం కలిగించిందని ప్రత్యేకంగా రెండు అంగన్వాడీ కేంద్రాల టీచర్లు అయిన రమణమ్మకు ,అరుణ కుమారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న 51వ వార్డు కౌన్సిలర్ తాటికొండ విజయ వార్డు ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు



నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 14 (నంది పత్రిక) నంద్యాల టౌన్ పరిధిలోని వై.యస్.ఆర్ నగర్ నందు గల స్టార్ సొసైటీ వారి నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసియా బుడగజంగాల హాస్టల్ నందు బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 51వ వార్డు కౌన్సిలర్ తాటికొండ విజయ,వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు యువ నాయకుడు తాటికొండ మహేష్ బాబు గారు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ భారతదేశ మొట్ట మొదటి ప్రధానమంత్రి జోహార్ లాల్ నెహ్రూ గారి జన్మదినాన్ని పురస్కరించుకుని వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది అని వారు అన్నారు.అదేవిధంగా బాలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి కౌన్సిలర్ విజయ చేతుల మీదగా ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరిగింది అని వారు అన్నారు. అనంతరం కౌన్సిలర్ విజయ చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు భోజనాలు వడ్డించడం జరిగిందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వ్యవస్థాపకులు సుబ్బారాయుడు,రాజేశ్వరి,కల్కి రాఘవేంద్ర, మరియు హాస్టల్ సిబ్బంది పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





బిల్లలాపురంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన దాదాపు 30 కుటుంబాలు



నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 14 (నంది పత్రిక)నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామానికి చెందిన దాదాపు 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. గ్రామ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఈ చేరికలు చోటుచేసు కున్నాయి. గ్రామ నాయకులు శంకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ. దేవేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి నూతనంగా పార్టీలో చేరిన వారిని ఆహ్వానించారు.ఈ సందర్భంగా శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ, పంచాయతీ ఎన్నికల ఫలితాలు తెలుగుదేశం పార్టీకి ప్రతికూల రాజకీయ పరిణామాలకు సంకేతమని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. హామీల అమలులో విఫలమైతే ప్రజల నుంచి రాజకీయంగా వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నూతనంగా పార్టీలో చేరిన కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

22 ఏళ్లకే సర్పంచ్ బరిలో.. ఏపీ రాజకీయాల్లోనే యువ సంచలనం!



పోరుమామిళ్ల, నవంబర్. 14 (నంది పత్రిక) రాష్ట్ర రాజకీయాల్లో యువతరం సరికొత్త చరిత్రకు శ్రీకారం చుడుతోంది. కడప జిల్లా పోరుమామిళ్ల మండలం, టేకూరుపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కేవలం 22 ఏళ్ల యువకురాలు నగిరి శివసాహితీ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. చిన్న వయసులోనే ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో వస్తున్న ఆమెకు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) పూర్తి మద్దతు ప్రకటించింది. శివసాహితీ తండ్రి భైరవ ప్రసాద్ ప్రస్తుతం పోరుమామిళ్ల టీడీపీ మండల అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తండ్రి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూ, ఉన్నత చదువులతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంపై అవగాహన ఉన్న శివసాహితీ పోటీ చేయడం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. సోమవారం స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ పెద్దలతో కలిసి ఆమె తన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిస్తున్న వేళ, 22 ఏళ్ల యువతి సర్పంచ్ పదవికి పోటీ పడటం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

శ్రీ మద్దిలేటీ దేవాలయ అభివృద్ధికి 3 లక్షల విరాళం అందజేసిన బిజ్జం మధు సూదన్ రెడ్డి.



బేతంచెర్ల నవంబర్ 14 (నంది పత్రిక). బేతంచెర్ల మండలం ఆర్ఎస్. రంగాపురం గ్రామ పరిధిలో వెలసిన ప్రముఖ వైష్ణవ క్షేత్రం, లక్షలాది మంది భక్తుల ఆరాధ్య దైవమగు శ్రీ మద్దులేటి నరసింహ స్వామి మరియు శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారు కొలువై వెలసి ఉన్న, శ్రీ మద్దులేటీ లక్ష్మీ నరసింహ స్వామి దేవ స్థానం,అభివృద్ధికి గాను, కర్నూలు జిల్లా కర్నూలు మండలము దిగువ పాడు గ్రామానికి చెందిన బిజ్జం లక్ష్మి రెడ్డి తనయుడు బిజ్జం మధు సూదన్ రెడ్డి శనివారం నాడు , శ్రీ మద్దులేటీ స్వామి దేవస్థానం అభివృద్ధికి గాను 3 లక్షల రూపాయల చెక్కును దేవస్థానం ధర్మ కర్తల మండలి చైర్మన్ ఉన్నం ఎల్ల నాఫయ్యకు శ్రీ మద్దులేటి స్వామి వారి కార్యాలయం లో అంద జేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చక స్వాములు,ధర్మ కర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో షోను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి

హనుమకొండ లోని కుడా హరిగ్రీవాచారి మైదానంలో నమస్తే తెలంగాణ, టీ న్యూస్ ఆధ్వర్యంలో శనివారం రోజున ఏర్పాటు చేసిన ఆటో షో కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు తో కలిసి ప్రారంభించారు

మొదట జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు

అనంతరం మాట్లాడుతూ... ఆటో షోను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మారుతున్న ప్రపంచంతో పాటు మనిషి అవసరాలు మారాయని, ప్రస్తుతం ఆటోమొబైల్ ఇండస్ట్రీస్ అవసరాలు మనిషికి పెరిగిపోయాని వివరించారు బైక్, కార్ మనిషి కనీస అవసరాలుగా మారాయని అన్నారు.ఆటో షోను కంపెనీలు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.తెలంగాణ సాధన ఉద్యమంలో నమస్తే తెలంగాణ పత్రిక ముఖ్య భూమిక పోషించిందని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అక్షర రూపం ఇచ్చిందని కొనియాడారు.4 సంవత్సరాలుగా ఆటో షో నిర్వహిస్తున్న నమస్తే తెలంగాణ, టీ న్యూస్, కంపెనీ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు

ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే ఎరువుల పంపిణీ



బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 14:బండి ఆత్మకూరు మండలంలో నవంబర్ 15 నుంచి ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా మాత్రమే ఎరువుల పంపిణీ జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎరువుల పంపిణీలో పారదర్శకతతో పాటు రైతులకు వారి అవసరాలకు అనుగుణంగా ఎరువులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ డిజిటల్ విధానాన్ని అమలు చేస్తోందని ఆయన తెలిపారు.యాప్ ద్వారా బుక్ చేయడానికి ఫార్మర్ ఐడీ, ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకానికి అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ (ఓటిపి) ఆధారంగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. భూ విస్తీర్ణం, వేసిన పంట ఆధారంగా వచ్చే క్యూఆర్ (క్యూఆర్) కోడ్/టోకెన్ ద్వారా 3 రోజుల్లో డీలర్ వద్ద ఎరువులు పొందాల్సి ఉంటుంది. రైతులు ముందుగా ఎఫ్ఎఫ్ఎస్ మొబైల్ యాప్‌లో రైతు గుర్తింపు/ఆధార్, మొబైల్ నంబర్ వివరాలతో నమోదు చేసుకోవాలని సూచించారు.రైతుల భూముల వివరాలను రైతు రిజిస్ట్రీతో అనుసంధానం చేసి, భూమి, పంట విస్తీర్ణం ఆధారంగా ఎరువుల అవసరాన్ని జీఎఫ్ఆర్ – జనరల్ ఫెర్టిలేజర్ రెకమండేషన్ విధానంలో నిర్ణయిస్తారని పేర్కొన్నారు. యాప్‌లో సూచించిన మేరకు ఎరువుల పరిమాణం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎరువులు తీసుకునే సమయంలో క్యూఆర్ కోడ్, టోకెన్ నంబర్ ఆధారంగా డీలర్ల వద్ద ఎరువులు పొందవచ్చని వివరించారు.యాప్ వినియోగంలో ఇబ్బందులు ఎదుర్కొనే రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల సిబ్బంది సహాయం పొందాలని ఏఓ పవన్ సూచించారు. ఎరువుల అక్రమ పంపిణీ, దుర్వినియోగం, కృత్రిమ కొరతను అరికట్టి నిజమైన రైతులకు సముచితంగా ఎరువులు అందించడమే ఈ విధానం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

అభ్యర్థులు నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేసుకోండి..

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

13 మండలాలకు సంబంధించి 67 క్లస్టర్ నామినేషన్ కేంద్రాల ఏర్పాటు

పోలీసు, రెవెన్యూ యంత్రాంగంతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

కడప, బ్యూరో చీఫ్ నవంబర్ 14 నంది పత్రిక: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలు లేకుండా నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేసుకోవాలని, అందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ప్రతి అభ్యర్థికి ప్రశాంతమైన వాతావరణంలో నామినేషన్ దాఖలు చేసుకునే అవకాశం కల్పించడం జిల్లా యంత్రాంగం బాధ్యతని కలెక్టర్ పేర్కొన్నారు. ఎవరైనా భయపెట్టినా, అడ్డంకులు సృష్టించినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎన్నికల అధికారులు, పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉండి తగిన రక్షణ చర్యలు తీసుకుంటారని తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా తమ నామినేషన్లను నిర్భయంగా దాఖలు చేసుకోవాలని ఆయన కోరారు.

సవరించిన నామినేషన్ కేంద్రాల జాబితా విడుదల

గ్రామ పంచాయతీల రెండో సాధారణ ఎన్నికలు2026లో భాగంగా మొదటి విడత ఎన్నికల నిర్వహణకు సంబంధించి సవరించిన నామినేషన్ కేంద్రాల క్లస్టర్ల జాబితా ప్రకారం అభ్యర్థులు తమ గ్రామ పంచాయతీకి కేటాయించిన క్లస్టర్ నామినేషన్ కేంద్రంలోనే నామినేషన్ పత్రాలను దాఖలు చేయాలని కలెక్టర్ సూచించారు.మొదటి విడతలో జిల్లాలోని మొత్తం 13 మండలాలకు సంబంధించి 67 క్లస్టర్ నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారని.. ప్రతి క్లస్టర్ పరిధిలో ఒకటి నుంచి ఐదు గ్రామ పంచాయతీలను చేర్చారన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం ప్రతి మండలంలో అవసరమైన రిజర్వ్ క్లస్టర్లను కూడా కేటాయించారన్నారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో బద్వేల్‌లో 4, అట్లూరులో 5, బి.కోడూరులో 4, గోపవరంలో 3, కలసపాడులో 4, పోరుమామిళ్లలో 6, శ్రీ అవధూత కాశీనాయన మండలంలో 6 క్లస్టర్ నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. కడప రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఒంటిమిట్టలో 4, సిద్ధవటంలో 6 క్లస్టర్ నామినేషన్ కేంద్రాలను కేటాయించారు. రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో నందలూరులో 4, రాజంపేటలో 11, టి.సుండుపల్లిలో 4, వీరబల్లిలో 6 క్లస్టర్ నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఈ క్లస్టర్ల పరిధిలో పోలింగ్ తేదీ నవంబర్ 26గా నిర్ణయించడం జరిగిందన్నారు.

తమ గ్రామ పంచాయతీకి కేటాయించిన కేంద్రాన్ని ముందుగానే తెలుసుకోవాలిఅభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడానికి ముందే తమ గ్రామ పంచాయతీ ఏ క్లస్టర్ పరిధిలో ఉందో సవరించిన జాబితా ద్వారా తెలుసుకోవాలన్నారు. సంబంధిత గ్రామ పంచాయతీకి కేటాయించిన నామినేషన్ కేంద్రంలోనే పత్రాలు సమర్పించాలని, ఇతర కేంద్రాల్లో దాఖలు చేసిన నామినేషన్లు చెల్లుబాటు కావని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అభ్యర్థికి సమాన అవకాశం కల్పించేలా, ఎలాంటి భయాలు, ఒత్తిళ్లు లేకుండా నామినేషన్ల దాఖలు నుంచి పోలింగ్ వరకు ప్రశాంత వాతావరణం ఉండేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ తెలిపారు..



కేసీ కెనాల్‌కు తక్షణమే సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోండి...

మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురుషోత్తం రెడ్డి

వర్షాభావం వల్ల ఎండిపోతున్న పంటలు..



నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 14 (నంది పత్రిక)నంద్యాల మండలంలో ఆందోళనలో అన్నదాతలుప్రకృతి కరుణించక, సరిపడా వర్షాలు కురవక అల్లాడిపోతున్న అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేయాలని, మంత్రి తక్షణమే స్పందించాలని రైతులు కోరుతున్నారు. నేడు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తం రెడ్డితో పాటు పలువురు రైతులు కేసీ కెనాల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు తాము పడుతున్న ఇబ్బందులను, కష్టాలను అధికారుల ఎదుట ఏకరువు పెట్టారు. సాగునీరు సకాలంలో అందక తాము సాగు చేసిన పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ‌ప్రస్తుతం వెలుగోడు రిజర్వాయర్‌లో 9.5 టీఎంసీల నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అందులో కేవలం ఒక్క టీఎంసీ నీటిని మాత్రమే కేసీ కెనాల్‌కు విడుదల చేస్తే, ఆయకట్టు కింద ఉన్న వేలాది ఎకరాల పంటలకు జీవం పోసినట్లవుతుందని కోరారు. ముఖ్యంగా జొన్న పంట సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు రోజుల్లోగా నీరు అందకపోతే పంట పూర్తిగా ఎండిపోయి, రైతులు కోలుకోలేని ఆర్థిక నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మంత్రివర్యులు మరియు ప్రజాప్రతినిధులు స్పందించి, రైతుల కష్టాలను మానవతా దృక్పథంతో పరిశీలించాలని కోరారు. తక్షణమే సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి, కేసీ కెనాల్ ద్వారా సాగునీరు అందించి తమను ఆదుకోవాలని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్పందించాలని విజ్ఞప్తి చేశారు.





ప్రశాంత వాతావరణంలో పంచాయతీ ఎన్నికలు: ఎస్పై మహమ్మద్ రఫీ

నామినేషన్ కేంద్రాల వద్ద సెక్షన్ 30 అమలు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



రుద్రవరం ప్రతినిధి నవంబర్ 14 (నంది పత్రిక): మండల పరిధిలోని గ్రామాలలో జరగనున్న పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా ప్రజలు, అభ్యర్థులు సహకరించాలని రుద్రవరం ఎస్పై మహమ్మద్ రఫీ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల ప్రక్రియలో ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల పరిధి వెలుపలే మద్దతుదారులు ఉండాలని, నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థితో పాటు మరో ఇద్దరిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని ఎస్పై తెలిపారు. నామినేషన్ కేంద్రాల పరిధిలో 104 సెక్షన్‌తో పాటు పోలీస్ చట్టం సెక్షన్ 30 అమలులో ఉంటుందని, అనుమతి లేకుండా గుంపులుగా చేరడం నిషేధమని పేర్కొన్నారు. అలాగే ర్యాలీలు, ఊరేగింపులు, మైకులు తదితర సౌండ్ సిస్టమ్స్ వినియోగానికి ఎలాంటి అనుమతి లేదన్నారు. లైసెన్స్ ఉన్న ఆయుధాలతో పాటు కత్తులు, కర్రలు, ఇతర ప్రమాదకరమైన వస్తువులను తీసుకురావడంపై పూర్తి నిషేధం విధించినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) పాటిస్తూ నామినేషన్ల ఘట్టం ప్రశాంతంగా పూర్తయ్యేలా అభ్యర్థులు, రాజకీయ నాయకులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, నిబంధనలు ఉల్లంఘించినా బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత) తదితర చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పై హెచ్చరించారు.

ఘనంగా బాలల దినోత్సవం.





రుద్రవరం ప్రతినిధి నవంబర్ 14 (నంది పత్రిక): మండల కేంద్రం రుద్రవరంలోని చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ శ్రీ పుట్టినరోజు సందర్భంగా బాలల దినోత్సవం ను రుద్రవరంలోని చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జబ్బార్ పిల్లలకి బాలల దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేసి బాల్యం చాలా అమూల్యమైనది విలువైనదని కొనియాడారు. హెడ్మాస్టర్ మేడా ప్రసాద్ మాట్లాడుతూ పండిట్ జవహర్లాల్ నెహ్రూ యొక్క జీవిత చరిత్రను పిల్లలకు చక్కగా వివరించి బాలలంటే ఎంతో ఇష్టం కనుక నెహ్రూ గారి యొక్క పుట్టినరోజును నేడు బాలల దినోత్సవం గా జరుపుకోవాలని చాలా గొప్ప విషయం అని, నెహ్రూ స్వాతంత్ర ఉద్యమంలో మహాత్మా గాంధీ యొక్క పిలుపుమేరకు దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారిని మన దేశం నుంచి విడిపించేటువంటి క్రమంలో తన వంతు చాలా కృషి చేసి జైలు జీవితాలు అనుభవించి మన దేశ స్వాతంత్రోద్యమానికి ఎంతగానో కృషి చేశాడని అదేవిధంగా మన దేశ మొదటి ప్రధాని మరియు నెహ్రూ కి భారతరత్న అవార్డు గ్రహీత అని పిల్లలు కూడా నెహ్రూ యొక్క జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని మంచి క్రమశిక్షణతో మంచి నడవడికతో తమ యొక్క జీవితాలను పూలబాటగా మలుచుకోవాలని మాట్లాడారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా నెహ్రూ పాటలు పాడడం మరియు నృత్యం చేసి తమ యొక్క సృజనాత్మకతను బయటికితీయుటకు ఇది ఒక మంచి వేదికగా ఉపయోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హుసేని, కైరును సా బేగం, భాగ్యశ్రీ, మహాలక్ష్మి, బిందు, షబానా, శ్రీవాణి, శ్రావణి, విజయలక్ష్మి, అమీనా, భువనేశ్వరి, సరళ, నారాయణమ్మ, హలీమా, సుజాత, తులసి మరియు విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఎంతో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించడం జరిగింది.

ప్రతిష్టాత్మక ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐ ఎస్ బి) నుంచి పబ్లిక్ పాలసీలో అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ డిగ్రీ అందుకున్న జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి..!

ప్రజా పాలనలో ఆధునిక విధానాలు, కృత్రిమ మేధస్సు వినియోగంపై ప్రత్యేక పరిశోధన

కడప, బ్యూరో చీఫ్ నవంబర్ 14: నంది పత్రిక వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఐఏఎస్, ప్రతిష్టాత్మక ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐ ఎస్ బి) నుంచి పబ్లిక్ పాలసీలో అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఏ ఎం పి పి పి) పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీని అందుకున్నారు. శనివారం మొహాలీలోని ఐ ఎస్ బి క్యాంపస్‌లో నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ డిగ్రీని స్వీకరించారు.భారత ప్రభుత్వ నామినేషన్‌పై డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఈ ప్రతిష్టాత్మకమైన ఒక సంవత్సరం వ్యవధి గల కోర్సును అభ్యసించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజా విధానాల రూపకల్పన, సమర్థవంతమైన అమలు, పాలనలో నూతన విధానాలు, సంస్థాగత పర్యవేక్షణ మరియు అమలు అనంతర సమీక్ష వంటి అంశాలపై లోతైన అవగాహన పొందే అవకాశం కలిగింది.ఈ కోర్సులో భాగంగా "ప్రజాసేవల మెరుగైన అందుబాటులో బిగ్ డేటా మరియు కృత్రిమ మేధస్సు వినియోగం" అనే అంశంపై ఆయన పరిశోధనా పత్రాన్ని (థీసిస్) సమర్పించారు. బిగ్ డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా ప్రజలకు అందించే ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో మరియు ప్రజా అవసరాలకు అనుగుణంగా ఎలా మెరుగుపరచవచ్చో ఈ పరిశోధనలో విశ్లేషించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజా పరిపాలనలో ఆధునిక విధానాలు, విధానపరమైన ఆవిష్కరణలు, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలపై విలువైన పరిజ్ఞానం లభించింది. ఈ కోర్సు ద్వారా పొందిన జ్ఞానం, అనుభవం వైఎస్ఆర్ కడప జిల్లాలో వినూత్న పాలనా విధానాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు దోహదపడనుంది.



మహానందిలో వీకెండ్ సందడి



మహానంది నవంబర్ 14 (నంది పత్రిక):- ప్రముఖ శైవ క్షేత్రమైన మహానంది భక్తుల రద్దీతో కళకళలాడింది.పవిత్ర కార్తీక మాసం కావడం,దీనికి తోడు శని, ఆదివారాలు వరుస సెలవు దినాలు రావడంతో రాష్ట్ర నలుమూలల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుండే భక్తులు ఆలయ కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు.అనంతరం శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకార్చన పూజలు నిర్వహించారు.మహిళలు, భక్తులు నాగుల కట్ట , నంది స్తూపం వద్ద మరియు ఆలయ ప్రాంగణాల్లో భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ అధికారులు దర్శనానికి తగిన ఏర్పాట్లు చేశారు.



రాష్ట్రస్థాయి జూడో పోటీలకు రాయలసీమ అకాడమీ క్రీడాకారులు



ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 14 నంది పత్రిక ఆళ్లగడ్డ లోని రాయలసీమ అకాడమీ క్రీడాకారులు హేమంత్ నాయక్,కార్తీక్ నాయక్, 13వ తేదీ నంద్యాలలోని పద్మావతి నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగినటువంటి జిల్లాస్థాయి జూడో సెలక్షన్స్ లో కార్తీక్ నాయక్ మరియు హేమంత్ నాయక్ ఎంపిక అయినారు ఎంపికైన క్రీడాకారులను పి ప్రభాకర్ బత్తుల రవి, శివకుమార్, నాగ శేషులు అభినందిస్తూ ఆళ్లగడ్డలో రాయలసీమ అకాడమీ నిర్వాహకులు ఎన్ సుబ్బారెడ్డి గారు , టి ఎస్ ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు సుభద్రమ్మ గారు ,, నవీన్ ఆళ్లగడ్డలో క్రీడల అభివృద్ధి కొరకు క్రీడాకారులను అన్ని విధాలుగా సహకరిస్తున్నారు అని భవిష్యత్తులో ఆళ్లగడ్డ నుండి అంతర్జాతీయ క్రీడా పోటీలలో పాల్గొనాలని ఎస్సీ ఎస్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ మరియు పిఈటి ప్రెసిడెంట్ ప్రభాకర్ అన్నారు బత్తుల రవి, శివకుమార్ శివకుమార్ మాట్లాడుతూ ఆళ్లగడ్డలో రాయలసీమ అకాడమీ అకాడమీ ని మేము సందర్శించాము రాయలసీమలోని ఎక్కడ లేని విధంగా ఒక ప్రైవేటు అకాడమీ ని ఏర్పరిచి తక్కువ సమయంలోనే జిల్లా మరియు రాష్ట్ర జాతీయ స్థాయిలో పథకాలు సాధిస్తున్నారు అంటే గొప్ప విషయమని వారు తెలిపారు శిక్షణ ఇస్తున్నటువంటి కోచ్ డిపి సుబ్బారాయుడును ప్రత్యేకంగా అభినందించారు,

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #D.NO.: 1-639-1-7-11, NEAR NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPARI, ANANTHAPURAMU, ANDHRA PRADESH-515411, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:-APTEL/26/A6831. Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

ఎన్నికల నామినేషన్ల స్వీకరణపై శిక్షణ



రుద్రవరం ప్రతినిధి నవంబర్ 14 (నంది పత్రిక): స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ పై ఆర్వోలు ఏఆర్వోలు డిజిటల్ అసిస్టెంట్లు వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఎంపీడీవో భాగ్యలక్ష్మి శిక్షణ ఇచ్చారు. రుద్రవరం మండలంలో నేటి నుండి ప్రారంభం కానున్న పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన విధి విధానాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలో నామినేషన్ల స్వీకరణకు 7 క్లస్టర్లు ఏర్పాటు చేశామని, ఒక్కో క్లస్టర్ లో ఒక ఆర్ఓ, ఒక ఏఆర్ఓ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది విధులు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. 7 క్లస్టర్లలో ఎన్నికలలో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు వార్డు మెంబర్ల అభ్యర్థుల నుండి వచ్చే నామినేషన్లను స్వీకరించి ఆన్లైన్లో నమోదు చేసే విధివిధానాలపై శిక్షణలో వివరించడం జరిగిందన్నారు. నామినేషన్ల ప్రక్రియ నిష్పక్షపాతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆర్వోలు ఏఆర్వోలకు సూచించామని ఎంపీడీవో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్వోలు ఏఆర్వోలు లెక్చరర్లు ఉపాధ్యాయులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో సహకార సంఘాల ఎన్నికలు

సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దిన్,సీఈఓ శివ కుమార్



నంది పత్రిక ఆత్మకూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరలో సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందన్న ఆత్మకూర్ సహకార సంఘం లోని సభ్యులు ఈ కేవైసీ చేసుకోవాలని ,అదేవిధంగా లోన్ బకాయిలు, ఉన్నవారు సహకార సంఘం ఎన్నికలలో ఓటు వేయుటకు అనర్హులు అదేవిధంగా లోన్ డిఫాల్ట్ అయిన సభ్యులకు కూడా ఓటు హక్కు ఉండదని, తెలియజేశారు బకాయిలు ఉంటే వెంటనే సొసైటీ అధికారులను సంప్రదించాలని , లోన్ బకాయిలను త్వరగా క్లియర్ చేసుకొనుటకు సహకార సంఘం అధికారులను సంప్రదించి సహకార సంఘం ఎన్నికలలో ఓటు వేయుటకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరిచేసుకోవాలి సహకార సంఘం నందు ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటును చెక్ చేసుకోవాలని ఆత్మకూర్ సొసైటీ చైర్మన్ ఎ. షహబుద్దిన్, సీఈఓ శివ కుమార్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సొసైటీ సిబ్బంది శంకర్ గౌడ్, రియాజ్, సురేంద్ర మరియు రైతులు పాల్గొన్నారు.

జ్యోతిర్మయి హైస్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో ముందుకు సాగాలి వయోజన విద్య ఉపసంచాలకులు కె.చంద్రశేఖర్ రెడ్డి



నంద్యాల ప్రతినిధి నవంబర్ 14 (నంది పత్రిక):– నంద్యాల పట్టణంలోని జ్యోతిర్మయి హైస్కూల్‌లో నవంబర్ 14వ తేదీన బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వయోజన విద్య ఉపసంచాలకులు కె.చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాదులని, ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యతో పాటు నైతిక విలువలు, సమయపాలన, పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర సృజనాత్మక రంగాల్లో కూడా ప్రతిభ కనబరచాలని సూచించారు.ఈ సందర్భంగా జ్యోతిర్మయి హైస్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, మంచి విద్యా వాతావరణంపై ఆయన ప్రత్యేకంగా ప్రశంసలు వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఇందు గారు విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం చూపుతున్న అంకితభావం, కృషి, పట్టుదల ఎంతో అభినందనీయమని కొనియాడారు. విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, వారిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం వంటి అంశాల్లో ఆమె చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ శ్రీమతి ఇందు గారి నిరంతర పర్యవేక్షణ, సమర్థవంతమైన నాయకత్వం, ఉపాధ్యాయులతో సమన్వయం కారణంగా విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లో కూడా మంచి ప్రతిభ కనబరుస్తున్నారని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా పాఠశాల అభివృద్ధికి సహకరిస్తూ, విద్యార్థులకు మంచి విద్యా వాతావరణం కల్పించడంలో తోడ్పడుతున్న పాఠశాల కరస్పాండెంట్ సురేష్ ను అభినందించారు.అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ముఖ్యఅతిథి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఎంతో ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందు , ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు





నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 14 (నంది పత్రిక)

నంద్యాల బాలాజీ కాంప్లెక్స్‌లోని శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్లో బాలల దినోత్సవ వేడుకలను శనివారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య కన్నుల పండువగా సాగాయి. ప్రీ-ప్రైమరీ నుంచి హైస్కూల్ వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమలోని ప్రతిభను, సృజనాత్మకతను ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ సుధాకర్ మార్గదర్శకత్వం అందించగా, ప్రిన్సిపాల్ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ విద్యార్థులను ప్రోత్సహించారు. పిల్లలలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంలో పాఠశాల యాజమాన్యం చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ ఈ వేడుకలో ప్రతిబింబించింది.కార్యక్రమంలో చిన్నారుల స్వాగత నృత్యాలు, వివిధ తరగతుల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, బాలల దినోత్సవ ప్రసంగాలు, పాటలు మరియు నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా 3, 4 తరగతుల విద్యార్థులు ప్రదర్శించిన "మిషన్ టూ సేవ్ అవర్ చైల్డ్‌హుడ్ " అనే నాటిక బాల్యంలోని ఆనందం, విలువలు మరియు చిన్నారుల స్వేచ్ఛను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను చక్కగా తెలియజేసింది. ఈ వేడుకల్లో భాగంగా నర్సరీ నుంచి 9వ తరగతి వరకు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 12 ప్రత్యేక అవార్డు విభాగాల్లో గుర్తించి సత్కరించారు. ఉత్తమ వక్త, స్టార్ స్టూడెంట్, ఉత్తమ చేతిరాత, విద్యా ప్రతిభ, క్రమశిక్షణ, క్రమబద్ధమైన హాజరు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమగ్ర అభివృద్ధి, హోంవర్క్, తరగతి గది భాగస్వామ్యం, నాయకత్వ లక్షణాలు మరియు ఉత్తమ యూనిఫాం నిర్వహణ వంటి విభాగాల్లో అవార్డులను ప్రిన్సిపాల్ దివ్య కోషి స్వయంగా విద్యార్థులకు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దివ్య కోషి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, బాలల దినోత్సవం ఎందుకు జరుపుకుంటామో, పిల్లల పట్ల ప్రేమ, ఆప్యాయత చూపడంతో పాటు వారి హక్కులు, ప్రతిభ మరియు భవిష్యత్తును ప్రోత్సహించడం ఎంత ముఖ్యమో వివరించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషి, ఆత్మవిశ్వాసం మరియు సమయపాలన ఎంతో అవసరమని తెలియజేశారు. చదువుతో పాటు సృజనాత్మకత, మంచి అలవాట్లు మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటూ ప్రతి విద్యార్థి తన కలలను నిజం చేసుకునే దిశగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు.

చైర్మన్ సుధాకర్ మార్గదర్శకత్వం, ప్రిన్సిపాల్ దివ్య కోషి ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సమన్వయం మరియు పాఠశాల సిబ్బంది కృషితో బాలల దినోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయి. ప్రతి చిన్నారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని ఆత్మవిశ్వాసం కలిగిన బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే పాఠశాల లక్ష్యమని ఈ వేడుక చాటిచెప్పింది.

డంపింగ్ యార్డు ఏర్పాటుకు చర్యలు



బనగానపల్లె నవంబర్14 నందిపత్రిక బనగానపల్లె మేజర్ పంచాయతీలో ప్రస్తుతం పెరుగుతున్న జనాభా (సుమారు 40 వేలు పై చిలుకు) మరియు ఇళ్ల సంఖ్యకు అనుగుణంగా చెత్త నిర్వహణ కోసం శాశ్వత ప్రాతిపదికన డంపింగ్ యార్డును ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థల సేకరణ మరియు ఎస్ డబ్యూ పీ సి షెడ్ ను పురోనియోగం చేయుట ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ప్రక్రియ పరిశీలనలో ఉందని మేజర్ పంచాయితీ ఈవో తెలిపారు.

చెత్త సంపద కేంద్రం వినియోగం: చెత్త సంపద కేంద్రం ద్వారా పూర్తిస్థాయిలో సంపద సృష్టి జరిగేలా తద్వారా ప్లాస్టిక్ మరియు తడి పొడి చెత్తను శాస్త్రీయంగా వేరుచేసి ఎరువు తయారీని మరింత వేగవంతం చేయడానికి తక్షణ చర్యలు చేపట్టడం జరుగుతోందని తెలిపారు .

పారిశుధ్య నిర్వహణ పంచాయతీ పరిధిలో నిత్యం సేకరిస్తున్న చెత్తను సకాలంలో తరలించడానికి, పారిశుధ్య కార్మికులు మరియు ట్రాక్టర్ల ద్వారా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి పకడ్బందీ చర్యలు అమలు చేయబడుతున్నాయని . ముఖ్యంగా బనగానపల్లె గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చెత్తను తడి చెత్త,పొడి చెత్తను వేరు చేసి చెత్త బండ్లకు అందించి గ్రామ పారిశ్యధ్యానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు.ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, పారిశుధ్య లోపాలకు తావులేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

మధుమేహ నివారణకు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి



వెలుగోడు, నవంబర్ 14 (నంది పత్రిక):మధుమేహ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధి ముప్పును తగ్గించుకోవచ్చని వైద్యాధికారులు సింధు ప్రియ, భాను ప్రకాష్ సూచించారు.ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఏపీవీహెచ్ఏ సహకారంతో శనివారం వెలుగోడు ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వైద్యాధికారులు మధుమేహ వ్యాధి నిర్ధారణ, నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సభ్యులకు, మహిళలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడంతో పాటు పోషక విలువలు, ప్రోటీన్లు అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం, శారీరక శ్రమకు ప్రాధాన్యత ఇవ్వడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా మధుమేహాన్ని ముందస్తుగా గుర్తించి నియంత్రించవచ్చని తెలిపారు.అధిక దాహం, తరచుగా మూత్ర విసర్జన, అలసట, చూపు మసకబారడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. మధుమేహ వ్యాధిగ్రస్తుల పట్ల సమాజంలో ఉన్న అపోహలు, వివక్ష తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ఇన్సులిన్‌తో పాటు అవసరమైన మందులు నిరంతరాయంగా, సరసమైన ధరలకు అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది కె. ఖాదర్ వలీ, లక్ష్మి, మెరిబా సంస్థ అధికారి జుల్ఫీ అలీ ఖాన్, జుబేదా, వైద్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో మానసిక వికాసం.. విజ్ఞాన సముపార్జన

పుస్తక పఠనంతో జ్ఞానం, ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసం



వెలుగోడు, నవంబర్ 14 (నంది పత్రిక):గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, పుస్తక పఠనం ద్వారా మానసిక వికాసంతో పాటు జ్ఞానం, ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయని మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మం నాయక్, గ్రంథాలయ అధికారి ఎన్.వి. సుమలత పేర్కొన్నారు.స్థానిక శాఖా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలను, భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మం నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత, పాఠకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని పుస్తక పఠనాన్ని జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానం పెరగడమే కాకుండా సృజనాత్మక ఆలోచనలు, మానసిక పరిపక్వత, మంచి వ్యక్తిత్వం అలవడతాయని తెలిపారు. అనంతరం భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఎన్.వి. సుమలత మాట్లాడుతూ.. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత, పాఠకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, ఇతర విజ్ఞాన సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

రుద్రవరం 1 ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన కృష్ణమూర్తి



రుద్రవరం ప్రతినిధి నవంబర్ 14 (నంది పత్రిక):రుద్రవరం మండలం విద్యాశాఖ ఒకటవ ఎంఈఓగా కే. కృష్ణమూర్తి శనివారం లాంఛనంగా బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)గా విధులు నిర్వహిస్తున్న ఆయనను విద్యాశాఖ ఉన్నతాధికారులు రుద్రవరం మండల విద్యాశాఖ అధికారిగా నియమించారు. ఈ మేరకు ఆయన ఎంపీడీవో భాగ్యలక్ష్మిని కలిసి తన జాయినింగ్ లెటర్ అందజేసి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ.. మండలంలోని పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్రవరం రెండవ ఎంఈఓ లక్ష్మి, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొలనుభారతిలో ప్రత్యేక పూజలు

-సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు





కొత్తపల్లి – నంది పత్రిక : పవిత్ర పుణ్యక్షేత్రమైన కొలనుభారతి దేవి క్షేత్రంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని ఆలయ పురోహితులు ప్రత్యేక అలంకరణ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొనేందుకు వచ్చారు. వచ్చిన భక్తులు అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి విశేష పూజలు చేసుకున్నారు. అదేవిధంగా సప్తశివాలయాలల్లోని దేవతామూర్తులను కూడా భక్తులు దర్శించుకొని విశేష పూజలు చేసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వారి చిన్నారులకు ఈ క్షేత్రంలో అక్షరాభ్యాసాలు చేయిస్తే మంచి విద్యా, బుద్ధులు ప్రాప్తిస్తాయని ధృడ నమ్మకం. కార్తీక మాసంలో భాగంగా పురోహితుల మంత్రోశ్చరణలతో చిన్నారులచే భీజాక్షరాలు దిద్దించి 22 సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఘన సన్మానం

నంద్యాల ప్రతినిధి. నవంబర్ 13 . (నంది పత్రిక):బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు నంద్యాలలోని ఫరూక్ నగర్, శారదా విద్యాపీఠం పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ నంద్యాల్ అధ్యక్షులు సందీప్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 2026 సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా లయన్స్ జోన్ చైర్మన్ నాగరాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు అలాగే లయన్ డాక్టర్ సహదేవుడు మాట్లాడుతూ విద్యార్థుల విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో ముఖ్యమని తెలిపారు.విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి మేడ చంద్రశేఖర్,సీనియర్ సభ్యులు గొల్ల సుదర్శన్, జనార్దన్,వాసు కుట్టి,పాఠశాల సలహాదారులు వసుందర దేవి,ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



రంగసముద్రం సర్పంచ్ అభ్యర్థి పసుపుల శృతికి వైఎస్సార్‌సీపీ నాయకుల మద్దతు

విజయం కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపు



పోరుమామిళ్ల, నవంబర్ 14 (నంది పత్రిక): పోరుమామిళ్లలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రంగసముద్రం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి పసుపుల శృతిని పార్టీ నాయకులు కలిసి బలపరిచారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి, ఎన్నికల రథసారథి, యువ నాయకుడు దేవసాని ఆదిత్య రెడ్డి, రంగసముద్రం మాజీ సర్పంచ్ చిత్త రవి ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి చాపాటి లక్ష్మీనారాయణ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రుద్రవరం రాము, ఎంపీటీసీ చిత్తగిరి ప్రణీత్ రెడ్డి, లెనిన్‌తో పాటు పంచాయతీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రంగసముద్రం సర్పంచ్ అభ్యర్థి పసుపుల శృతి విజయానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

షఫీ కుటుంబానికి న్యాయం చేయాలి.. ఇల్లు లేదా మూడు సెంట్ల స్థలం కేటాయించాలి: ఎర్రకోట రాజీవ్ రెడ్డి



ఎమ్మిగనూరు నవంబర్ 14(నంది పత్రిక) ఎమ్మిగనూరు పట్టణంలోని 44వ వార్డుకు చెందిన షఫీ కుటుంబం నివాసముంటున్న రేకుల షెడ్డును కూల్చివేసి ఆ కుటుంబాన్ని నిరాశ్రయులుగా మార్చిన ఘటనపై వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం వైఎస్సార్‌సీపీ పార్టీకి మద్దతుగా ఎన్నికల్లో ప్రచారం చేయడం, పార్టీ కోసం పనిచేయడమే షఫీ చేసిన తప్పా? ఒక రాజకీయ పార్టీకి మద్దతుగా నిలిచినందుకు ఒక పేద కుటుంబాన్ని రోడ్డున పడేయడమేనా ప్రజాస్వామ్యంలో మీరిచ్చే రక్షణ? అని రాజీవ్ రెడ్డి గారు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు రక్షణ కరువైందని, అధికారాన్ని అడ్డం పెట్టుకుని పేద, మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తూ, వారి నివాసాలను కూల్చివేసి పైశాచిక ఆనందం పొందడం ఎంతవరకు సమంజసమని కూటమి నేతలను నిలదీశారు. రాజకీయ కక్షలు ఉంటే రాజకీయంగానే ఎదుర్కోవాలి కానీ, పేదల కుటుంబాల జీవనాధారాన్ని, నిలువ నీడను దెబ్బతీయడం ఏ విధమైన న్యాయం? ఒక కుటుంబం రోడ్డున పడితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారు? షఫీ కుటుంబానికి తక్షణమే ప్రత్యామ్నాయంగా నివాసయోగ్యమైన ఇల్లు లేదా మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని, బాధిత కుటుంబంతో కలిసి మున్సిపల్ కమిషనర్ గారి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. ఈ రోజు అధికారం మీది కావచ్చు.. కానీ రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారిని ఎలా కాపాడుకోవాలో, వారి వెనుక ఎలా నిలబడాలో మాకు బాగా తెలుసు. మా కార్యకర్తలను ఒంటరిగా వదిలిపెట్టే ప్రసక్తే లేదు! అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సాధువులకు దుప్పట్లు పంపిణీ చేసిన ఎస్పై



బనగానపల్లె నవంబర్ 14 నందిపత్రిక బనగానపల్లె మండలం మీరపురం గ్రామ వాసి సత్య సాయి జిల్లాలో ఎస్పైగా విధులు నిర్వహిస్తున్నబత్తుల మల్లికార్జున రెడ్డి తమ కుమారుడైన బత్తుల రిత్విక్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం శ్రీ ఉమామహేశ్వర స్వామి యాగంటి దేవస్థానం నందు సాధువులకు వృద్ధులకు అనాధలకు దుప్పట్లు పంపిణీ చేశారు కార్యక్రమంలో ఎస్పై సోదరుడు బత్తుల రామ్మోహన్ రెడ్డి రామకృష్ణారెడ్డి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ డే సందర్భంగా ఘనంగా ఫ్రెండ్షిప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ఆళ్లగడ్డ, ప్రతినిధి నవంబర్ 14: నంది పత్రిక పట్టణంలోని కె.వి.కె ఇండోర్ స్టేడియంలో బాలల దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్షిప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.ఈ టోర్నమెంట్‌లో మొదటి, రెండవ కోర్టులకు సంబంధించి ఆరు జట్లు, మూడవ, నాలుగవ కోర్టులకు సంబంధించి ఆరు జట్లు కలిపి మొత్తం 12 జట్లు పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించాయి.

టోర్నమెంట్ విజేతలు:

మొదటి బహుమతి విజేతలు: అమర్ మహేష్ ఓబులేష్ ప్రకాష్

రెండవ బహుమతి విజేతలు:తిరుపతి శ్రీ నుమౌలాలి మల్లికార్జున

అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లక్ష్య స్పోర్ట్స్ అకాడమీ ప్రెసిడెంట్‌ప్రజ్ఞ విద్యాసంస్థల అధినేత నరసింహారెడ్డి హుస్సేన్ భాష, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ సి. గంగన్న, కె.వి.కె ఇండోర్ స్టేడియం సీనియర్ ప్లేయర్ సంజీవ, హనుమాన్ హార్డ్‌వేర్ అధినేత భరత్ కుమార్‌లు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కె.వి.కె ఇండోర్ స్టేడియం కోచ్ వెంకటరమణ మాట్లాడుతూ..ఇలాంటి ఫ్రెండ్షిప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ల నిర్వహణ వల్ల క్రీడాకారుల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందడంతో పాటు పరస్పర సహకారం, క్రీడా స్ఫూర్తి అలవడుతాయని తెలిపారు. అంతేకాకుండా క్రీడల ద్వారా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. క్రీడాకారుల్లో మరింత ఉత్సాహం, ఆసక్తి పెంపొందించేందుకు ఇకపై ప్రతి నెలా కె.వి.కె ఇండోర్ స్టేడియంలో ఇలాంటి మోటివేషన్ టోర్నమెంట్లను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ క్రీడాకారుల్లో స్నేహభావాన్ని, క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా చక్కటి టోర్నమెంట్ నిర్వహించిన కోచ్ వెంకటరమణను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు.



బాలసదనంలో ఘనంగా బాలల దినోత్సవం



ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 14 నంది పత్రిక ఆళ్లగడ్డ పట్టణంలోని బాలసదనం లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి శనివారం నాడు జరిగిన కార్యక్రమంలో బాలసదనం సూపరిండెంట్ రోజా రాణి అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ నోడల్ అధికారిని ఉమామహేశ్వరమ్మ జిల్లా బాలల సంరక్షణ అధికారిణి స్వప్న ప్రియదర్శిని , సంరక్షణ అధికారి శ్రీనివాస్ , మెడికల్ ఆఫీసర్ డా.సింధియా , ఐసిడిఎస్ సూపర్వైజర్ దస్తగిరమ్మ, గాయత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఉద్దేశించి నోడల్ అధికారి మాట్లాడుతూ బాలల దినోత్సవ ఆవశ్యకత గురించి క్లుప్తంగా వివరించారు మరియు డిసిపిఓ స్వప్న మాట్లాడుతూ పిల్లలకు క్రమశిక్షణతో కూడిన మంచి అలవాట్లను అలవర్చుకోవాలని తెలిపారు అలాగే బాగా చదివి ఉన్నత స్థాయికి రావాలని కోరారు. సంరక్షణ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ బాలల హక్కుల గురించి వివరించారు అలాగే ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే బాలసదనం పర్యవేక్షకులకు గాని లేదా నమ్మకస్తులకు చెప్పాలని తెలిపారు మెడికల్ అధికారి సింధియా మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత గురించి పిల్లలకు క్లుప్తంగా వివరించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ దస్తి గిరమ్మ మాట్లాడుతూ బాలల దినోత్సవం జరుపుకోవడానికి గల ముఖ్య ఉద్దేశాన్ని క్లుప్తంగా పిల్లలతో చర్చించారు. కార్యక్రమం అనంతరం పిల్లలకు మెడికల్ ఆఫీసర్ పిల్లలకు కావాల్సిన వ్యక్తిగత వస్తువులను కిట్టు ద్వారా ఇచ్చారు పిల్లలకు మిఠాయిలను పంచి ఉత్సవాలను ఘనంగా జరిగాయి

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



కొత్తపల్లి – నంది పత్రిక : ఒక మంచి పుస్తకం వంద మంది మిత్రులతో సమానమని, గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని కొత్తపల్లి గ్రంథాలయశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన శనివారం స్థానిక గ్రంథాలయంలో 59 వ గ్రంథాలయ వారోత్సవ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 14 బాలల దినోత్సవం పురస్కరించుకొని గ్రంథాలయ వారోత్సవ వేడుకలలో భాగంగా ఈనెల 15న పుస్తక ప్రదర్శన 16న గ్రంథాలయ ఉద్యమకారుల స్మరణ 17 18 వ తేదీల్లో వివిధ పాఠశాలల విద్యార్థుల వ్యాసరచన చిత్రలేఖనం వక్తృత్వ పోటీలు 19న జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణ 20న వారోత్సవ ముగింపు కార్యక్రమం ఉంటుందని అనంతరం పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

గిరిబాబు అస్తమయం తెలుగు సినీ జగత్తుకు తీరని లోటు...!

బోల్లు రామమోహన్

కడప నవంబర్ 14 (నంది పత్రిక రిపోర్టర్)నటుడిగా ఆరు వందలకు పైగా చిత్రాలు, దర్శకుడిగా, నిర్మాతగా విభిన్న ప్రయోగాలు.. ఐదు దశాబ్దాలకు పైగా సాగిన కళాప్రస్థానం!

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటుచేసుకుంది. విలక్షణ నటనతో ఐదు దశాబ్దాలకు పైగా ప్రేక్షకులను అలరించిన ప్రముఖ నటుడు, దర్శకుడు, నిర్మాత గిరిబాబు (యర్రా శేషగిరిరావు) ఇక లేరు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నవంబర్ 14, శనివారం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో తెలుగు సినీ పరిశ్రమలో విషాద ఛాయలు అలముకున్నాయి.కళకు మరణం లేదు.. కళాకారుడికి మరుపు లేదు! అన్న మాటకు నిలువెత్తు నిదర్శనం గిరిబాబు సినీ ప్రస్థానం.

పల్లెటూరి నుంచి వెండితెర వరకు..1946 జూన్ 8న ప్రకాశం జిల్లా రావినూతల గ్రామంలో జన్మించిన గిరిబాబుకు చిన్నతనం నుంచే నాటకాలు, కళారంగంపై ఆసక్తి ఉండేది. ఆ ఆసక్తే ఆయనను సినీ రంగం వైపు నడిపించింది. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఆయన తన ప్రతిభ, పట్టుదలతో తెలుగు చిత్రసీమలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.పట్టుదల ఉంటే పర్వతాన్నైనా అధిరోహించవచ్చు.. ప్రతిభ ఉంటే ప్రతిబంధకాలనైనా అధిగమించవచ్చు అనే సామెతకు ఆయన జీవితం ఒక ఉదాహరణ.

'జగమే మాయ'తో మొదలైన నట ప్రస్థానం.. 1973లో విడుదలైన 'జగమే మాయ' చిత్రంతో గిరిబాబు వెండితెరకు పరిచయమయ్యారు. తొలినాళ్లలోనే ప్రతినాయకుడిగా తనదైన శైలిని ప్రదర్శించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. గంభీరమైన స్వరం, ప్రత్యేకమైన హావభావాలు, సంభాషణలు పలికించే విలక్షణ పద్ధతి ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయి.విలన్‌గా తెరపై భయపెట్టినా, హాస్యనటుడిగా నవ్వించినా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా కుటుంబ బంధాలను గుర్తుచేసినా.. ప్రతి పాత్రలోనూ తనదైన ముద్ర వేసేవారు.

వేషం చిన్నదైనా నటన గొప్పదైతే చరిత్రలో నిలిచిపోతారు

అన్న నానుడిని ఆయన నిజం చేశారు. నటనలో వైవిధ్యం.. ప్రతిభలో విశాలత్వం!

దాదాపు 600కు పైగా చిత్రాల్లో నటించిన గిరిబాబు తెలుగు సినిమా స్వర్ణయుగం నుంచి ఆధునిక తరం సినిమాల వరకు తన నటనతో ప్రేక్షకులను అలరించారు. 'కురుక్షేత్రం'లో దుశ్శాసనుడి పాత్రతో పాటు 'పసివాడి ప్రాణం', 'హలో బ్రదర్', 'సిసింద్రి', 'లిటిల్ సోల్జర్స్', 'అతడు', 'గమ్యం', 'అ ఆ', 'గీత గోవిందం', 'జాతిరత్నాలు' వంటి అనేక చిత్రాల్లో విభిన్నపాత్రలు పోషించి తన ప్రత్యేకతను చాటుకున్నారు.ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా కాలానుగుణంగా మారుత కొత్త తరాల ప్రేక్షకులకు కూడా చేరువయ్యారు.

నవరసాలు తెలిసిన నటుడికి నవతరాల ఆదరణ ఎప్పుడూ ఉంటుంది అనడానికి గిరిబాబు ప్రయాణమే నిదర్శనం. **నటుడిగానే కాదు.. దర్శకుడిగా, నిర్మాతగా కూడా!**గిరిబాబు ప్రతిభ నటనకే పరిమితం కాలేదు. దర్శకత్వం, నిర్మాణం, కథా రచన వంటి విభాగాల్లోనూ తనదైన ముద్ర వేశారు. 'రణరంగం', 'ఇంద్రజిత్', 'నీ సుఖమే నే కోరుతున్నా' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించి తన సృజనాత్మకతను చాటుకున్నారు. 'మెరుపు దాడి', 'దేవతలారా దీవించండి' వంటి చిత్రాల నిర్మాణంలోనూ భాగస్వాములయ్యారు.ఒక కళాకారుడిగా తెరపై కనిపించడం ఒక ఎత్తయితే, తెరవెనుక బాధ్యతలు చేపట్టి చిత్రాన్ని రూపొందించడం మరో ఎత్తు. ఈ రెండు రంగాల్లోనూ ఆయన తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు.ఒక చేత్తో నటన.. మరో చేత్తో సృజన.. రెండింటితోనూ ప్రేక్షకుల మనసులు గెలుచుకోవడం ఆయన ప్రత్యేకత!

వ్యక్తిత్వమే అసలైన ఆస్తి..సినీ పరిశ్రమలో పేరు, ప్రతిష్ఠలు సంపాదించడం కంటే వాటిని నిలబెట్టుకోవడం కష్టం. గిరిబాబు తన సుదీర్ఘ ప్రయాణంలో అనేకమంది కళాకారులతో కలిసి పనిచేస్తూ పరిశ్రమతో విడదీయలేని అనుబంధాన్ని ఏర్పరచుకున్నారు. కుటుంబ విలువలకు ప్రాధాన్యతనిస్తూ, తన కుమారుడు రఘుబాబు కూడా నటుడిగా గుర్తింపు పొందేలా సినీ వారసత్వాన్ని అందించారు.మనిషి సంపాదించిన ఆస్తి ఒకరోజు కరిగిపోవచ్చు.. కానీ సంపాదించిన మంచి పేరు తరతరాలకు నిలిచిపోతుంది.

భౌతికంగా దూరమైనా.. జ్ఞాపకాలలో చిరంజీవి! గిరిబాబు మరణంతో తెలుగు చిత్రసీమ ఒక అనుభవజ్ఞుడైన నటుడిని కోల్పోయింది. ఆయన పోషించిన ప్రతినాయక పాత్రలు, పండించిన హాస్యం, కుటుంబ పాత్రల్లో పలికించిన భావోద్వేగాలు ప్రేక్షకుల జ్ఞాపకాలలో ఎప్పటికీ నిలిచిపోతాయి.సినిమా ముగిసిన తర్వాత తెరపై వెలుగులు ఆగిపోతాయి. కానీ గొప్ప నటుడు పంచిన కళ మాత్రం కాలంతో పాటు మరింత వెలుగుతుంది.కాలం కళాకారుడిని మనకు దూరం చేయవచ్చు.. కానీ ఆయన కళను మన జ్ఞాపకాల నుంచి చెరిపివేయలేదు.గిరిబాబు జీవితం ఒక నటుడి విజయగాథ మాత్రమే కాదు.. పట్టుదల, ప్రతిభ, కష్టనష్టాలను ఎదుర్కొనే తత్వానికి ప్రతీక. తెలుగు సినిమా చరిత్రలో ఆయనది చెరిగిపోని అధ్యాయం.ఆయన మరణం తెలుగు చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆ మహానటుడికి అక్షర నివాళులు అర్పిద్దాం.నటుడిగా ఎన్నో పాత్రలు.. దర్శకుడిగా ఎన్నో ప్రయోగాలు.. నిర్మాతగా ఎన్నో కలలు.. ప్రేక్షకుల హృదయాల్లో మాత్రం ఎప్పటికీ ఒకే పేరు గిరిబాబు!కళాకారుడు కనుమరుగైనా కళ కాలగర్భంలో కలిసిపోదు. అదే నిజమైన చిరస్మరణీయం!



అక్షర నివాళి.. నటశిఖరం గిరిబాబుకు శ్రద్ధాంజలి!

గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన సీఐ ఆర్.జి. సుబ్రహ్మణ్యం

పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు.. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలి



పోరుమామిళ్ల, నవంబర్ 14 (నంది పత్రిక):గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో కడప జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, మైదుకూరు డీఎస్పీ స్వీయ పర్యవేక్షణలో పోరుమామిళ్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జి. సుబ్రహ్మణ్యం నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పోరుమామిళ్ల మండలంలోని నామినేషన్ కేంద్రాల ప్రధాన ప్రాంతాలైన పోరుమామిళ్ల పట్టణం, రంగసముద్రం, అక్కులరెడ్డిపల్లె, టేకూరుపేట, టీ. చల్లగిరిగెల గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాలను పోరుమామిళ్ల ఎస్ఐ, పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు.గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 144 సెక్షన్‌తో పాటు పోలీసు చట్టంలోని 30వ సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు పోలీసు శాఖకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ ఆర్.జి. సుబ్రహ్మణ్యం కోరారు.

క్రీడలతోనే విద్యార్థుల్లో సమగ్ర వికాసం.

నారాయణ ప్రీమియర్ లీగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు.

ఆదోని నంది పత్రిక ప్రతినిధి



ఆదోని నారాయణ పాఠశాలలో శనివారం నిర్వహించిన నారాయణ ప్రీమియర్ లీగ్ (ఎం పి ఎల్) క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్. అమర్ ప్రకాష్, కే.ఎం. ముజీబ్, ఏజీఎం అన్వర్ భాషా, కిడ్స్ జోనల్ కోఆర్డినేటర్ జయిబా, ఛాంప్స్ జోనల్ కోఆర్డినేటర్ ప్రియాంక హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు శ్రీమతి లక్ష్మీ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, ఆ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు నారాయణ ప్రీమియర్ లీగ్ వంటి క్రీడా వేదికలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.ముఖ్య అతిథి ఎస్. అమర్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమైనవని తెలిపారు. క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదని, పట్టుదల, క్రమశిక్షణ, సమయపాలనతో పాటు జట్టుగా పనిచేసే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఏజీఎం అన్వర్ భాషా మాట్లాడుతూ విద్యార్థులు నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ఆటతీరుతో అందరినీ ఆకట్టుకున్నారని తెలిపారు. మైదానంలో విద్యార్థుల ఉత్సాహం, జట్ల మధ్య పోటీ, ప్రేక్షకుల కేరింతలతో క్రీడా వాతావరణం సందడిగా మారిందన్నారు. కే.ఎం. ముజీబ్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లల్లో చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలని అన్నారు. ఆటలు విద్యార్థుల్లో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. గెలుపు ఒక్కటే లక్ష్యం కాదని.. క్రీడాస్ఫూర్తితో ఆడటం, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవడం, పట్టుదలతో ముందుకు సాగడమే నిజమైన విజయం అని విద్యార్థులకు సూచించారు.జోనల్ కోఆర్డినేటర్లు జయిబా, ప్రియాంక మాట్లాడుతూ నారాయణ ప్రీమియర్ లీగ్ ద్వారా విద్యార్థులకు తమ ప్రతిభను ప్రదర్శించే మంచి అవకాశం లభిస్తోందన్నారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు క్రీడా రంగంలోనూ వారిని ప్రోత్సహిస్తూ నారాయణ ప్రీమియర్ లీగ్ నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



పోరుమామిళ్ల సర్పంచ్ అభ్యర్థిగా షేక్ సునిహా ప్రకటన – నల్లేరు విశ్వనాథరెడ్డి

మూడు దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉన్న షేక్ అన్వర్ భాష అలియాస్ అల్లా కుటుంబానికి వైసీపీ ప్రాధాన్యత..

పోరుమామిళ్ల నవంబర్ 14 (నంది పత్రిక):పోరుమామిళ్ల టౌన్ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి షేక్ సునిహాను ప్రకటించింది. బద్వేల్ నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాలుగా రాజకీయాల్లో కొనసాగుతూ, పోరుమామిళ్ల ప్రాంత ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న షేక్ అన్వర్ భాష అలియాస్ అల్లా సేవలను, రాజకీయ అనుభవాన్ని గుర్తించి ఆయన కుమార్తె షేక్ సునిహాకు సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ నెల 26న జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లో పోరుమామిళ్ల గ్రామపంచాయతీ ప్రజలు షేక్ అన్వర్ భాష (అల్లా) అందించిన మూడు దశాబ్దాల ప్రజాసేవను గుర్తించి, ఆయన కుమార్తె షేక్ సునిహాకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.సునిహా సర్పంచ్‌గా ఎన్నికైతే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ పోరుమామిళ్ల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యావంతురాలైన షేక్ సునిహాకు ప్రజలు మద్దతుగా నిలిచి, తమ అమూల్యమైన ఓటుతో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నల్లేరు విశ్వనాథ రెడ్డి కోరారు.



నగరంలో ఆరోగ్య ప్రమాణాలు పాటించని హోటల్స్ పై కఠిన చర్యలు.





కమిషనర్ ఎం.జయకృష్ణ.

తిరుపతి బ్యూరో చీఫ్ నవంబర్ 14 నంది పత్రిక

నగరంలో ఆరోగ్య ప్రమాణాలు పాటించకుండా అనారోగ్యకరమైన ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ హెచ్చరించారు. నగరంలోని హోటల్స్ లో అనారోగ్యకరమైన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారనే ప్రజల పిర్యాదుతో కమిషనర్ ఆదేశాల మేరకు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ బృందంతో కలసి శనివారం నగరంలోని పలు హోటల్స్ తనిఖీలు నిర్వహించారు. ఇందులో ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న టేబుల్ 9 హోటల్, కేటీ రోడ్డు లో ఉన్న టేబుల్ 9 హోటల్ బ్రాంచ్ మరియు కరకంబాడీ రోడ్డు వద్ద ఉన్న టేబుల్ 9 హోటల్ మరో బ్రాంచ్ లను ఆరోగ్య శాఖ అధికారి మరియు వారి సానిటరీ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగినది ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న టేబుల్ 9 హోటల్ లో కిచెన్, పాత్రలు శుభ్రపరిచే రూమ్ మరియు స్టోర్ రూమ్ అపరిశుభ్రంగా ఉండడం గుర్తించారు, హోటల్ నందు పేస్ట్ కంట్రోల్ మెజర్స్ తీసుకోకపోవడం, అందుకు తగిన సర్టిఫికెట్ లేకపోవడం గమనించి స్టోర్ రూమ్ ను వెంటనే మూసివేయడం జరిగినది. అనంతరం కేటి రోడ్డు లో ఉన్న టేబుల్ 9 హోటల్ బ్రాంచ్ నందు జరిగిన తనికిలో కిచెన్, గ్రైండింగ్, వెస్సెల్ శుభ్రపరిచే రూమ్ లలో అపరిశుభ్రంగా ఉండడం బూజు పట్టి పొగ కమ్ముకొనున్న గోడలు, హోటల్లోని డ్రైనేజ్ బ్లాక్ అయిఉండడం,హోటల్ వ్యర్థాలు విచ్చలవిడిగా వేసి ఉండడం వ్యర్థాలు వేరుచేయక పోవడం మరియు స్టోర్ రూంలో విపరీతమైన బొద్దింకలు విచ్చలవిడిగా తిరుగుచు స్టోర్ చేసిన వంటకు వినియోగించు సరుకులపై తిరుగుతుండడం గుర్తించారు. హోటల్ యాజమాన్యం హోటల్లో ఎలాంటి పేస్ట్ కంట్రోల్ మేస్సర్స్ తీసుకోక పోవడం, సర్టిఫికెట్ లేకపోవడం, పురుగులు పట్టి కాలం చెల్లిన ముడి సరుకు ప్యాకెట్లు, బ్రెడ్ ప్యాకెట్లు స్టోర్ రూమ్ లో ఉండడం గుర్తించారు. నిషేధిత సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగంను గుర్తించి పై వాటిని అన్నింటిని స్వాధీనం చేసుకొని స్టోర్ రూమ్ ను మూసివేసి, అపరాధ రుసుము విధించారు. స్టోర్ రూమ్ శుభ్రం చేయించి పెస్ట్ కంట్రోల్ మెజర్స్ చేయించే వరకు హోటల్లో ఎలాంటి వ్యాపారం చేయరాదని హెచ్చరించి నోటీసును జారీచేయడమైది అలాగే కరకంబాడి రోడ్డు లోని టేబుల్ 9 హోటల్ బ్రాంచ్ ను కూడా తనిఖీలు చేయగా, అందులో పరిశుభ్రంగా ఉండడం గుర్తించారు. పై తనిఖీలను అనుసరించి మున్సిపల్ కమిషనర్ గారు మాట్లాడుతూ పవిత్రమైన పుణ్య క్షేత్రం అయిన తిరుపతిలో ప్రజలకు, ఇతర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు నాణ్యమై ఫుడ్ (ఆహారపదార్థాలు)అందించాలని, దీని కొరకు అనేక చర్యలు తీసుకుంటున్నామని అయినా ప్రజలకు వచ్చే యాత్రికుల ఆరోగ్యానికి హానీ కలిగించే నాణ్యత లేని ఆహారపదార్థాలు అమ్మిన,వినియోగించే వ్యాపారాలు చేసిన, ప్రజలనుండి కచ్చితమైన నిరూపణలతో పిర్యాదులు వచ్చిన తనిఖీలు నిర్వహించి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించిరి.నగరంలో ఆరోగ్య ప్రమాణాలు పాటించని హోటల్స్ పై కఠిన చర్యలు.

కమిషనర్ ఎం.జయకృష్ణ. నగరంలో ఆరోగ్య ప్రమాణాలు పాటించకుండా అనారోగ్యకరమైన ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ హెచ్చరించారు. నగరంలోని హోటల్స్ లో అనారోగ్యకరమైన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారనే ప్రజల పిర్యాదుతో కమిషనర్ ఆదేశాల మేరకు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ బృందంతో కలసి శనివారం నగరంలోని పలు హోటల్స్ తనిఖీలు నిర్వహించారు. ఇందులో ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న టేబుల్ 9 హోటల్, కేటీ రోడ్డు లో ఉన్న టేబుల్ 9 హోటల్ బ్రాంచ్ మరియు కరకంబాడీ రోడ్డు వద్ద ఉన్న టేబుల్ 9 హోటల్ మరో బ్రాంచ్ లను ఆరోగ్య శాఖ అధికారి మరియు వారి సానిటరీ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు ఇందులో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న టేబుల్ 9 హోటల్ లో కిచెన్, పాత్రలు శుభ్రపరిచే రూమ్ మరియు స్టోర్ రూమ్ అపరిశుభ్రంగా ఉండడం గుర్తించారు, హోటల్ నందు పేస్ట్ కంట్రోల్ మెజర్స్ తీసుకోకపోవడం, అందుకు తగిన సర్టిఫికెట్ లేకపోవడం గమనించి స్టోర్ రూమ్ ను వెంటనే మూసివేయడం జరిగినది.

పిమ్మట ఖు రోడ్డు లో ఉన్న టేబుల్ 9 హోటల్ బ్రాంచ్ నందు జరిగిన తనికిలో కిచెన్, గ్రైండింగ్, వెస్సెల్ శుభ్రపరిచే రూమ్ లలో అపరిశుభ్రంగా ఉండడం బూజు పట్టి పొగ కమ్ముకొనున్న గోడలు, హోటల్లోని డ్రైనేజ్ బ్లాక్ అయిఉండడం,హోటల్ వ్యర్థాలు విచ్చలవిడిగా వేసి ఉండడం వ్యర్థాలు వేరుచేయక పోవడం మరియు స్టోర్ రూంలో విపరీతమైన బొద్దింకలు విచ్చలవిడిగా తిరుగుచు స్టోర్ చేసిన వంటకు వినియోగించు సరుకులపై తిరుగుతుండడం గుర్తించారు. హోటల్ యాజమాన్యం హోటల్లో ఎలాంటి పేస్ట్ కంట్రోల్ మేస్సర్స్ తీసుకోక పోవడం, సర్టిఫికెట్ లేకపోవడం, పురుగులు పట్టి కాలం చెల్లిన ముడి సరుకు ప్యాకెట్లు, బ్రెడ్ ప్యాకెట్లు స్టోర్ రూమ్ లో ఉండడం గుర్తించారు, హోటల్ నందు పేస్ట్ కంట్రోల్ మెజర్స్ తీసుకోకపోవడం, అందుకు తగిన సర్టిఫికెట్ లేకపోవడం గమనించి స్టోర్ రూమ్ ను వెంటనే మూసివేయడం జరిగినది.

స్టోర్ రూమ్ శుభ్రం చేయించి పెస్ట్ కంట్రోల్ మెజర్స్ చేయించే వరకు హోటల్లో ఎలాంటి వ్యాపారం చేయరాదని హెచ్చరించి నోటీసును జారీచేయడమైది అలాగే కరకంబాడి రోడ్డు లోని టేబుల్ 9 హోటల్ బ్రాంచ్ ను కూడా తనిఖీలు చేయగా, అందులో పరిశుభ్రంగా ఉండడం గుర్తించారు. పై తనిఖీలను అనుసరించి మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పవిత్రమైన పుణ్య క్షేత్రం అయిన తిరుపతిలో ప్రజలకు, ఇతర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు నాణ్యమై ఫుడ్ (ఆహారపదార్థాలు)అందించాలని, దీని కొరకు అనేక చర్యలు తీసుకుంటున్నామని అయినా ప్రజలకు వచ్చే యాత్రికుల ఆరోగ్యానికి హానీ కలిగించే నాణ్యత లేని ఆహారపదార్థాలు అమ్మిన,వినియోగించే వ్యాపారాలు చేసిన, ప్రజలనుండి కచ్చితమైన నిరూపణలతో పిర్యాదులు వచ్చిన తనిఖీలు నిర్వహించి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించిరి.

శ్రీశైలం దేవస్థానంలోఆకస్మిక తనిఖీలు



శ్రీశైలం నవంబర్ 14(నంది పత్రిక)(14.11.2026) సాయంత్రం ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ యం.శ్రీనివాసరావు పలు ప్రదేశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలువురు అధికారులతో కలిసి చేసిన ఈ తనిఖీలలో భక్తుల సౌకర్యాలకు సంబంధించి పలు ఆదేశాలు జారీ చేశారు. దేవస్థానం కల్యాణకట్ట ప్రాంగణ పరిసరాలు, శివసేవకుల డార్మెటరీలు, శివదీక్షా శిబిరాలు, సిద్ధిరామప్పవాణిజ్య సముదాయ పరిసరాలు, మల్లికార్జునసదన్, గణేశ్ ఫుడ్ కోర్ట్, గణేశ సదనం, నక్షత్రవనం తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షుల వారు మాట్లాడుతూ దేవస్థానం పరిధిలో అన్నీ ప్రదేశాలలో కూడా శుచీశుభ్రతలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అన్ని వసతి సముదాయలలో, భవనాలలో, ఆరుబయలు ప్రదేశాలలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా సిబ్బంది అందరు భక్తులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. అదేవిధంగా డార్మెటరీలలో శివసేవకులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. మల్లికార్జునసదన్, గణేశ్ సదన్ తదితర భవనాల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. ఆయా భవన సముదాయాలలో ఎప్పటికప్పుడు అవసరమైన మరమ్మతులు చేస్తుండాలన్నారు. వసతిగదులలో ఏసి, ఫ్యాన్లు, గీజర్లన్నీ సజావుగా పనిచేసే విధంగా రోజువారి పర్యవేక్షణను చేస్తుండాలని వసతివిభాగ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా మరమ్మతులు అవసరమైతే ఎటువంటి ఆలస్యం లేకుండా ఆయా గదులలో మరమ్మతులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా గదులు, కాటేజీలు ఖాళీ అయిన వెంటనే ఎటువంటి ఆలస్యం లేకుండా వాటిని శుభ్రపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా ఈ తనిఖీల సందర్భంగా కార్యనిర్వహణాధికారి వారు మాట్లాడుతూ సిబ్బంది అందరు కూడా సమయపాలనను ఖచ్చితంగా పాటించాలన్నారు. కేశఖండానికి వచ్చే భక్తులు అధిక సమయం వేచివుండకుండా తగు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కల్యాణకట్టతో పాటు అన్ని భవనాలలో విద్యుద్దీపాలు, ఫ్యాన్లు సజావుగా పనిచేసే విధంగా సంబంధిత సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వీటిని పరిశీలిస్తుండాలన్నారు. సిబ్బంది ఏకరూప దుస్తులు ధరించాలని అన్నారు. అదేవిధంగా సిబ్బంది అందరు కూడా గుర్తింపుకార్డులను ధరించాలన్నారు. ఏ ఒక్క భక్తుడి నుంచి కూడా ఫిర్యాదు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తుండాలని అక్కడి సిబ్బంది సూచించారు. భవన ప్రాంగణాలలో ఫ్లోరింగ్ మొదలైన చోట్ల ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తుండాలన్నారు. క్షేత్రపరిధిలోని శౌచాలయాల నిర్వహణ పట్ల అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. శౌచాలయాల శుభ్రత నిరంతరం జరుగుతుండలన్నారు. భవనసముదాయలలో, ఆరుబయలు ప్రదేశాలలో మరిన్ని మొక్కలు నాటాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో సహాయ కార్యనిర్వహణాధికారులు యం. ఫణిధర ప్రసాద్, కె. వెంకటేశ్వరరావు, సి.హెచ్. శ్రీనివాసరెడ్డి, ఇంఛార్జి డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు చంద్రశేఖరశాస్త్రి, పి.వి. సుబ్బారెడ్డి, పర్యవేక్షకులు బి. శ్రీనివాసులు, పి. రాజశేఖర్, సంబంధిత సహాయక ఇంజనీర్లు, ఉద్యానవన అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మహానంది క్షేత్రంలో జిల్లా జడ్జి అమ్మన్న రాజా పూజలు



మహానంది, నవంబర్ 14 (నంది పత్రిక):- మహానంది క్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారిని నంద్యాల జిల్లా జడ్జి డి.అమ్మన్న రాజా వారి కుటుంబ సభ్యులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. ముందుగా అలయానికి చేరుకున్న వీరికి ఆలయ ఏఈవో మధు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.అనంతరం వారు శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు.పూజలు అనంతరం అలంకార మండపంలో స్వామివారి ఏఈఓ శేష వస్త్రాలతో సత్కరించగా,వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

దాతల సహకారంతో నేను రోడ్డు వేశానని నిరూపించలేకపోతే

చైర్మన్ పదవిని వదులుకుంటావా ???

నాగనాదేశ్వర కోన మాజీ చైర్మన్ గుమ్మా లక్ష్మి రెడ్డి

భాజీపేట (నంది పత్రిక ప్రతినిధి) నవంబర్ 14

నాగనాధేశ్వర స్వామి కోన మాజీ చైర్మన్ అయిన గుమ్మ లక్ష్మిరెడ్డి ఈ రోజు విలేఖర్లతో మాట్లాడుతూ నాగనాధేశ్వర స్వామి భక్తులకు ప్రజలకు తెలియజేయడం ఏమనగా ప్రస్తుత నాగనాధేశ్వర స్వామి కోన చైర్మన్ సూర్య సుమన్ రెడ్డి ఈరోజు ఒక పాత్రికేయుడితో మాట్లాడుతూ మేము దాతల సహకారంతో కొండ పైకి రోడ్డు వేశామని అన్నారు .. మీరు ఆ విషయాన్ని నిరూపించలేకపోతే చైర్మన్ గిరి కి రాజానామా చేయగలరా అని ఆలయ మాజీ చైర్మన్ గుమ్మా లక్ష్మి రెడ్డి ప్రస్తుత చైర్మన్ సూర్య సుమన్ రెడ్డి కి సవాలు విసిరారు. గత చైర్మన్ గుమ్మా లక్ష్మీరెడ్డి ఆలయ అభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదు అలాంటి వ్యక్తి తన తండ్రి విగ్రహాన్ని అక్కడ పెట్టడంతో లేని అభ్యంతరం ఈరోజు మా అబ్బ విగ్రహాన్ని పెడితే అభ్యంతరం వచ్చిందా ఆయన తండ్రి ఏమైనా స్వాతంత్ర సమరయోధుడా అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల పట్ల మేము తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ఖండిస్తున్నాము. అయ్యా సూర్య సుమన్ రెడ్డి మీరు మీ అబ్బ విగ్రహాన్ని పెడితే ఎవరు అభ్యంతరం పెడుతున్నారో వాళ్ళ దగ్గరికి వెళ్లి అడగండి అంతేకానీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సబబు కాదు. మేము మా పూర్వీకుల కాలం నుండి నాగనాథేశ్వర స్వామి భక్తులము అప్పటినుండి శక్తిమేర సొంత నిధులతో ప్రతీ కార్తీక మాసంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నాము . 2015లో చాలామంది భక్తులు వృద్ధాప్యం కారణంగా కొండ దగ్గరకు చేరుకుంటున్నారు కానీ పైకి వెళ్లి నాగనాథేశ్వరుని దర్శించుకోలేక వెనుదీరగడం గమనించి అందరూ ఆ నాగనాథేశ్వరుని దర్శించుకోవాలనే సదుద్దేశంతో 2015లో కొండపైకి వాహనాలు వెళ్లేలా దారి ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో అప్పట్లోనే దాదాపు 16 లక్షల రూపాయల సొంత నిధులతో కొండపైకి రోడ్డు ఏర్పాటు చేసినాము. తర్వాత 2018లో పైన వాహనాల పార్కింగ్ కోసం దాదాపు 12 లక్షల రూపాయలు వెచ్చించాము. ఆ దేవునికి మేము చేసిన సేవలను గుర్తించి శాసనసభ్యులు మాకు చైర్మన్ గిరి ఇచ్చారు తప్ప మేము ఎప్పుడూ మీలా పదవుల కోసం వెంపర్లాడలేదు. ఆలయ అభివృద్ధికి మేము మా సొంత డబ్బులు ఖర్చుపెట్టిన విషయం అప్పటి వరకు ఎక్కడో ఉన్న నీకు తెలియదేమో కానీ ఇక్కడే ఉన్న నీ తమ్ముడిని ఒకసారి అడుగు. మీరు గుడిని ఇంతలా అభివృద్ధి చేస్తున్నాడు మీ తండ్రిగారి విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేయమని మొట్టమొదట సూచించింది మీ తమ్ముడు ఆదినారాయణ రెడ్డి .ఆయనే ఆళ్లగడ్డకు వచ్చి విగ్రహాన్ని సెలెక్ట్ చేశారు కావాలంటే ఒకసారి అడిగి నిర్ధారించుకో .ఈరోజు కొత్తగా వచ్చిన నీకు విషయాలు తెలియకపోవచ్చు ఏమో కానీ నీ తమ్ముడిని అడిగి వాస్తవాలు తెలుసుకోవాలని కోరుతున్నాను . మేము ప్రభుత్వం నుండి 50 లక్షల రూపాయలు రోడ్డు వేసినందుకు బిల్ చేసుకున్నామని ఆరోపించారు .అది 2019లో కొండపైకి సిమెంటు రోడ్డు కోసం ప్రభుత్వం మంజూరు చేసింది కానీ మేము మా సొంత డబ్బులతో వేసిన మెటల్ రోడ్డు కోసం కాదు అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. నాగనాధేశ్వర స్వామి పేరు మీద చందాల రూపేణ వచ్చిన సొమ్ము ప్రతి రూపాయి ఆలయ అభివృద్ధి కోసం వెచ్చించి ఇంతలా అభివృద్ధి చేసామన్నది గమనించమని కోరుతున్నాం. కొండ దిగువన భక్తులు బాటసారులు ఏ ఒక్కరూ కూడా ఆకలితో ఉండకూడదు అన్న తలంపుతో ముందుగా మా సొంత నిధులతో అన్నదాన సత్యాన్ని ఏర్పాటు చేసి నిరాటంకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నాము. దాతల సహకారంతో నిత్య అన్నదానాన్ని ప్రారంభించి శాశ్వత అన్నదాన కేంద్రాన్ని ప్రారంభించాము . మీరు మీ స్వలాభం కోసం ఆ సత్రాన్ని కూడా మూసి వేయించారు . అసలు ముందు అక్కడ నుంచి ఆ సత్రాన్ని పూర్తిగా ఖాళీ చేయించాలని ప్రయత్నించి విఫలమయ్యారు. ఈరోజు ఎంతోమంది ఆకలి తీర్చిన ఆ సత్రం నిరుపయోగంగా ఉండటానికి కారణం మీరు కాదా?దాతల సహకారంతో కట్టించిన సత్రంలో అన్నదానం చేసేందుకు మేము నేటికీ సిద్ధంగా ఉన్నాము . అక్కడ అన్నదాన కార్యక్రమం నిర్వహించే దానికి మీకు ఇగోలు అడ్డొస్తున్నాయా లేదా అక్కడ అన్నదానం ఏర్పాటు చేస్తే పాత చైర్మన్ గారికి పేరు వస్తుందన్న మీ అభద్రతాభావమా... ఈనాటికి భక్తులు అప్పట్లో మేము ఏర్పాటు చేసిన అన్నదాన విధానాన్ని ఇప్పుడు మీరు చేస్తున్న అన్నదాన విధానాన్ని పోల్చుకుంటూ ఆకలితో మిమ్మల్ని తిట్టుకుంటూ వెళ్తున్నారని పత్రికల్లో వస్తున్న వార్తలను చూసి అయినా మీకు కనువిప్పు కలవడం లేదా . ఈనాడు ఏ నాగనాధేశ్వరుని భక్తుడిని అయినా అడుగగా దేవాలయానికి నేను చేసిన సేవలు ఏమిటో చెప్తారు గత చైర్మన్ అభివృద్ధి చేయలేదు అని మీరు అన్నారు కదా మేము అభివృద్ధి చేయకపోతే ఈరోజు నీవు ప్రతి రోజు కొండపైకి ఎలా చేరుకుంటున్నావు కొండపైకి ఎక్కేటప్పుడు కనీసం మీకు ఒక్కసారైనా ఆ విషయం గుర్తు రావట్లేదా. ఈనాటికి మేము ఏర్పాటు చేసిన మోటార్లు పైపుల ద్వారా నీరు పైకి చేరుతున్నాయి అన్న విషయాన్ని మీరు మర్చిపోయారా. 2007 నుండి మీరు అనుభవిస్తున్న దేవుని మాన్యం 7 ఎకరాల 20 సెంట్లు మీరు ఏమేరో అద్దే చెల్లిస్తున్నారు ఎంత చెల్లించారు తెలుపగలరు . మీరు చేస్తున్న అభివృద్ధి , అవినీతి గురించి గత కొద్ది రోజులుగా పత్రికల్లో వస్తున్న వార్తలను చూసి ప్రజలందరూ నిజానిజాలు తెలుసుకుంటున్నారు. మీరు కనీసం పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేసి లావాదేవీలు ఎందుకు బహిర్గతం చేయలేకపోతున్నారు అది ఆ పరమశివునికే తెలియాలి. ఈ విలేఖర్ల సమావేశంలో నాగనాదేశ్వర కోన మాజీ చైర్మన్ గుమ్మా నాగ లక్ష్మీ రెడ్డి , గుమ్మా లక్ష్మీ రెడ్డి మరియు గుమ్మా నారాయణ రెడ్డి లు పాల్గొన్నారు.



పిల్లలకు చిన్న వయస్సు నుంచే మొబైల్ ఫోన్లను దూరంగా ఉంచాలి...

సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు

కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పీడియాట్రిక్స్ విభాగంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ

తల్లిదండ్రులు చిన్న వయస్సు నుంచే పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వడం తగ్గించాలని, అధికంగా మొబైల్ ఫోన్లు, టీవీలు చూడటం వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు.పిల్లలు మొబైల్ ఫోన్లకు బదులుగా ఆటలు, పుస్తక పఠనం వంటి మంచి అలవాట్లను అలవర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు.చిన్నారులు ప్రతిరోజూ పౌష్టికాహారం, తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. పిల్లలు చదువుతో పాటు ఆటలు, వ్యాయామం, ఇతర సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనాలని, మంచి అలవాట్లతో క్రమశిక్షణ కలిగిన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పిల్లలకు పండ్లు, పుస్తకాలను అందజేసారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ తో పాటు డిప్యూటీ సూపరింటెండెంట్ డా లక్ష్మీ భాయ్ , పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ మరియు హెచ్.ఓ.డి డా సుహాసిని , రిటైర్డ్ ప్రొఫెసర్ డా జి.శారదా మరియు పీడియాట్రిక్స్ విభాగం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల్లో రాజీ పడే ప్రసక్తే లేదు టీడీపీ పట్టణ అధ్యక్షులు కె. రామాంజనేయులు

కర్నూల్ సిటీ నంది పత్రిక కోడుమూరు నియోజకవర్గం గూడూరు మున్సిపాలిటీలోని 21వ వార్డు పరిధిలో శాశ్వత మంచినీటి పథకంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ సోమేశ్‌తో కలిసి తెలుగుదేశం పార్టీ గూడూరు పట్టణ అధ్యక్షులు, గూడూరు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె. రామాంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా కె. రామాంజనేయులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.గూడూరు పట్టణ ప్రజలకు శాశ్వతంగా మంచినీటి సమస్య పరిష్కారం కావాలనే లక్ష్యంతో చేపడుతున్న ఈ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం, నాణ్యతా లోపాలు జరిగినా సహించేది లేదని స్పష్టం చేశారు.ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి పనిని నిరంతరం పర్యవేక్షిస్తామని, పట్టణ అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు రేమట వెంకటేష్, కోడుమూరు షాషావలి,పుట్టపాశం గిరి, జి.వెంకటేష్, మాజీ కౌన్సిలర్లు బుద్దంగలి, చాంద్,బీజేపీ మైనారిటీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దేశ్ పాండే సద్దాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



కర్నూలు సిటీ నంది పత్రిక కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం బోగోలు గ్రామం నందు ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు డిఎల్ ఫౌండేషన్ ప్రతినిధులు స్టేషనరీ పంపిణీ చేశారు. పాఠశాలలో చిల్డ్రన్స్ డే సందర్భంగా డి ఎల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయురాలు కే సునీత సహకారంతో 1 నుండి.5వ తరగతి చదువుతున్న 38 మంది విద్యార్థులకు ప్లేట్స్, బుక్స్ తదితర స్టేషనరీ అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్ ఫౌండేషన్ ప్రతినిధులు డి శేఖర్, ఏం రాజు. జగదీష్, శశికాంత్, రెడ్డిపోగు దేవ వరం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాంబోట్ల దేవాలయం వద్ద శ్రీ కాళికామాత అమ్మవారిని దర్శించుకున్న మంత్రి టీజీ భరత్

కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూలు నగరంలోని రాంబోట్ల దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ కాళికామాత అమ్మవారి విగ్రహాన్ని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.



పంచాయతీ ఎన్నికల నామినేషన్ల వేళ ... పటిష్ట పోలీసు బందోబస్తు.

అందరూ ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు ...

కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

- నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఇద్దరు ప్రతినిధులకు మాత్రమే అనుమతి.

- నామినేషన్ కేంద్రాల వద్ద ర్యాలీలు, ఊరేగింపులు, గుంపులుగా రావడం నిషేధం.

- జిల్లాలో 30 పోలీస్ యాక్ట్, సెక్షన్ 163 బి ఎన్ యస్ యస్ నిషేధాజ్ఞలు అమలు.

- నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర నిఘా.

- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు.



కర్నూల్ సిటీ నంది పత్రిక పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ శనివారం తెలిపారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు కేవలం ఇద్దరు ప్రతినిధులకు మాత్రమే అనుమతి ఉంటుందని, నామినేషన్ కేంద్రాల వద్ద ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం, గుంపులుగా రావడం పూర్తిగా నిషేధమని తెలిపారు.జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ మరియు సెక్షన్ 163 బి ఎన్ యస్ యస్ నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని, నామినేషన్ కేంద్రాలకు 100 నుంచి 200 మీటర్ల పరిధిలో జనసమూహాలు గుమిగూడడం, నినాదాలు చేయడం, ప్రచారం నిర్వహించడం వంటి చర్యలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

కామన్వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో కర్నూలు విద్యార్థుల సత్తా.. అంతర్జాతీయ స్థాయిలో పతకాలతో మెరిసిన క్రీడాకారులు

హేమంత్ కుమార్ రెడ్డికి గోల్డ్ మెడల్.. దినేష్‌కు బ్రాంజ్ మెడల్ విజేత క్రీడాకారులను ఘనంగా సత్కరించిన మంత్రి టీజీ భరత్

కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూలు స్కాట్లాండ్‌లో నిర్వహించిన 12వ కామన్వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్2026లో కర్నూలుకు చెందిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం ఎంతో గర్వకారణమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు క్రీడాకారులు అంతర్జాతీయ వేదికపై సత్తా చాటడం జిల్లా ప్రజలకు ఎంతో ఆనందాన్ని, గౌరవాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ పాల్గొని పతక విజేతలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామన్వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం మొత్తం 23 పతకాలు సాధించగా, ఆంధ్రప్రదేశ్‌కు మూడు పతకాలు లభించాయని తెలిపారు. ఇందులో కర్నూలుకు చెందిన హేమంత్ కుమార్ రెడ్డి గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. మరో క్రీడాకారుడు దినేష్ బ్రాంజ్ మెడల్ సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడాకారుల విజయాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా అపాయింట్‌మెంట్ తీసుకుని ఇటీవల వారిని కలిసే అవకాశం కల్పించానని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి క్రీడాకారులతో స్వయంగా మాట్లాడి వారి విజయాలను అభినందించారని చెప్పారు. గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారుడికి రాష్ట్ర ప్రభుత్వం తరపున అందాల్సిన ప్రైజ్ మనీ ఇప్పించేందుకు కృషి చేస్తున్నానని మంత్రి వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు అందించే సర్టిఫికెట్లు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాల అవకాశాలకు కూడా ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కర్నూలులో క్రీడా రంగ అభివృద్ధికి తాము ఎంతో కృషి చేస్తున్నామని, క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ పి. జగదీష్ కుమార్ ని మంత్రి టి.జి. భరత్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల విజయాల వెనుక కోచ్ కృషి, అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో 61వ వార్డు కార్పొరేటర్ గాజుల విజయభాస్కర్ రెడ్డి, 62వ వార్డు కార్పొరేటర్ సురేంద్ర, సీనియర్ కరాటే మాస్టర్స్ హరీష్, గౌస్ బాషా, రమణ, ఫయాజ్, మునాఫ్, రాంబాబు, సురేంద్ర చిన్న తదితరులు పాల్గొన్నారు.



భారత ప్రజాస్వామ్య సౌధానికి నిర్మాత జవహర్ లాల్ నెహ్రూ

మాజి ఎమ్మెల్సీ యం సుధాకర్ బాబు



కర్నూల్ సిటీ నందిపత్రిక భారత ప్రజాస్వామ్య సౌధానికి నిర్మాత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసిసి సభ్యులు ఎం సుధాకర్ బాబు అభిప్రాయ పడ్డారు. జవహర్ లాల్ నెహ్రూ 137 వ జయంతి సందర్భంగా శనివారం ఉదయం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మనకు స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం భారత తొలి ప్రధాన మంత్రిగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఎన్నిక అయ్యారని, నెహ్రూ మంచి పరిపాలనా దక్షుడని ఆగర్భ శ్రీమంతుడయినా నిరాడంబరుడని, స్వాతంత్ర్య ఉద్యమంలో జైలు జీవితం గడిపాడని నెహ్రూ మంచి రచయితగా, పండితుడుగా, చరిత్రకారుడిగా భారతదేశ రాజకీయాల్లో శక్తివంతమైన నాయకుడిగా ఎదిగారని భారత దేశ మొదటి ప్రధాని అయ్యాక దేశాన్ని అనేక సంక్షోభాల నుండి గట్టెక్కించాడని నెహ్రూ గారు భారత ప్రజాస్వామ్య సౌధానికి నిర్మాత అయ్యాడని ప్రజాస్వామిక విధానం, ఐదేళ్ల ఎన్నికల విధానం వల్లనే సాధారణ వ్యక్తులు ప్రజా ప్రతినిధులు కాగలుగుతున్నారని ప్రజాస్వామ్యంలో నియంతల మెడలు వంచేది ఎన్నికల విధానమేనని ఈ ఎన్నికల విధానం లేకపోతే భారతదేశం కూడా మరో పాకిస్థాన్ లా, మయన్మార్ లా తయారై ఉండేదని సమసమాజ స్థాపనే పరిపాలన లక్ష్యం కావాలని నెహ్రూగారు ఆకాంక్షించారని, ఆయనకు చిన్న పిల్లలంటే అమితమైన ప్రేమ అని అందుకే ఆయన పుట్టినరోజును బాలల దినోత్సవంగా జరుపు కుంటున్నామని సుధాకర్ బాబు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ముందుగా పార్టీ కార్యాలయంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తల సమావేశం జరిగినది. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉండవల్లి వెంకటన్న, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ని బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కర్నూలు జిల్లా ఇంచార్జి తెలుగు విజయ్ కుమార్, ఏపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్టియుసి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్ కాంగ్రెస్ నాయకులు బి సుబ్రహ్మణ్యం, యు శేషయ్య, మద్దిలేటి, యూత్ కాంగ్రెస్ నాయకులు హుమయూన్ మొదలగు వారు పాల్గొన్నారు.

సామాజిక సేవలో బ్లైండ్ ఫౌండేషన్ సంస్థ అవసరమైన పరికరాలను నిర్వాహకులకు అందజేసిన మంత్రి టీజీ భరత్

సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తాం మంత్రి టీజీ భరత్

కర్నూలు సిటీ నంది పత్రిక కర్నూలు నగరంలోని మంత్రి టీజీ భరత్ కార్యాలయంలో బ్లైండ్ ఫౌండేషన్ సంస్థకు కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన వాషింగ్ మిషన్, రిఫ్రిజిరేటర్, కంప్యూటర్, ఆఫీస్ టేబుల్స్, డెస్క్‌టాప్, కీబోర్డులను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. బ్లైండ్ ఫౌండేషన్ వంటి సేవా సంస్థలకు టీజీవీ గ్రూప్ సంస్థలతో పాటు కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. గతంలో బ్లైండ్ ఫౌండేషన్‌ను సందర్శించిన సమయంలో సంస్థ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు కంప్యూటర్లను అందజేశామని గుర్తు చేశారు. తాజాగా సంస్థ ప్రతినిధులు తమకు అవసరమైన వస్తువులను సమకూర్చాలని విజ్ఞప్తి చేయడంతో కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ సౌజన్యంతో వాషింగ్ మిషన్, రిఫ్రిజిరేటర్, కంప్యూటర్, ఆఫీస్ టేబుల్స్, డెస్క్‌టాప్, కీబోర్డులను అందజేసినట్లు వెల్లడించారు. టీజీవీ గ్రూప్ సంస్థల ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. సేవా సంస్థలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

అనంతరం బ్లైండ్ ఫౌండేషన్ ప్రతినిధి సుధాకర్ మాట్లాడుతూ రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, ఆయన కుమారుడు, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ తమ సంస్థకు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. కర్నూలు నగరంలో టీజీ కుటుంబం అందిస్తున్న సేవా కార్యక్రమాలను చిన్నప్పటి నుంచి చూస్తున్నానని, దశాబ్దాలుగా వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు.



ముఖ్యంగా బ్లైండ్ ఫౌండేషన్‌కు వారు అందిస్తున్న సహకారం సంస్థ కార్యకలాపాలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, భవిష్యత్తులోనూ ఇదే విధమైన సహకారం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, టీడీపీ నేత గౌరు వెంకటరెడ్డి, కర్నూలు నగర మేయర్ విజయ ప్రత్యూష, బ్లైండ్ ఫౌండేషన్ ప్రతినిధి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో 7వ నేషనల్ వాటర్ అవార్డు సాధనే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి

నీటి సంరక్షణ, జల వనరుల అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రదర్శించాలి క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చే కేంద్ర బృందానికి జిల్లాలో చేపట్టిన ఉత్తమ పనులను వివరించాలి జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల బ్యూరో, నవంబరు 14(నంది పత్రిక):- జిల్లాలో నీటి సంరక్షణ, జల వనరుల అభివృద్ధి, భూగర్భ జలాల పరిరక్షణకు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను సమర్థవంతంగా వివరించి, 7వ జాతీయ జల అవార్డులు (సెవెన్ త్ నేషనల్ వాటర్ అవార్డ్స్) సాధించే దిశగా సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 7వ జాతీయ జల అవార్డుల సాధనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సిన ప్రతిపాదనలు, జిల్లాలో నీటి సంరక్షణ కోసం చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సెంట్రల్ వాటర్ కమిషన్ నుంచి వచ్చే బృందం జిల్లాలో చేపట్టిన నీటి సంరక్షణ, జల వనరుల అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ధ్రువీకరించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో, సమగ్ర నివేదికలు, ఆధారాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ నెల 17, 18 తేదీల్లో కేంద్ర బృందం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో బనగానపల్లి, ఔకు, కొలిమిగుండ్ల తదితర ప్రాంతాల్లో పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జల వనరుల శాఖ, డ్వామా ఆధ్వర్యంలో చేపట్టిన నీటి సంరక్షణ పనులు, పండ్ల తోటలు, మొక్కల పెంపకం, పాఠశాలలు, గ్రామ పంచాయతీలు, ఆసుపత్రుల్లో పచ్చదనం పెంపునకు చేపట్టిన కార్యక్రమాలను బృందానికి వివరించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా రెండవ రోజు నంద్యాల పట్టణంలోని మురుగునీటి శుద్ధి కేంద్రం (ట్రీట్‌మెంట్ ప్లాంట్), పాణ్యం, బేతంచెర్ల, డోన్ మండలాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి, నీటి సంరక్షణ కార్యక్రమాలను కేంద్ర బృందం పరిశీలించనున్నట్లు తెలిపారు. మైక్రో ఇరిగేషన్, జల వనరులు, డ్వామా, పబ్లిక్ హెల్త్, గ్రౌండ్ వాటర్ తదితర శాఖలు తమ పరిధిలో అమలు చేసిన ఉత్తమ కార్యక్రమాలను గుర్తించి, వాటి ఫలితాలు, ప్రభావాన్ని స్పష్టమైన గణాంకాలు, ఫొటోలు, సంబంధిత రికార్డులతో సహా ప్రదర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చినప్పుడు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, జిల్లాలో సాధించిన ప్రగతిని సమర్థవంతంగా వివరించేలా నాణ్యమైన ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని సూచించారు. జాతీయ స్థాయిలో నంద్యాల జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చేలా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేసి, 7వ జాతీయ జల అవార్డు సాధనకు కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

క్రీడాకారులకు అద్భుత వేదికగా ఏసీఈ బ్యాడ్మింటన్ ఏరియా కోర్టు

బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభించిన మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తుకు ఎన్నో అవకాశాలు మంత్రి టీజీ భరత్



కర్నూలు సిటీ నంది పత్రిక విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో ఎన్నో అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలో డాక్టర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన ఏసీఈ బ్యాడ్మింటన్ ఏరియా కోర్టును మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో ఇంత మంచి బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు, యువత, వారి తల్లిదండ్రులు ఈ సదుపాయాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో తప్పనిసరిగా పాల్గొనాలని, ఆసక్తి ఉన్న క్రీడలో నిరంతరం సాధన చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించాలంటే కష్టపడి సాధన చేయాలని, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. కర్నూలు నగరంలో ఇలాంటి అత్యుత్తమ క్రీడా మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడం సంతోషకరమని, మరింత మంది క్రీడాకారులు ఈ అకాడమీ ద్వారా ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. ఈ బ్యాడ్మింటన్ కోర్టును ఏర్పాటు చేసిన నిర్వాహకులు జనార్దన్, ఇమానియేలు రాజేష్‌లను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డు కార్పొరేటర్ రాఘవేంద్ర రెడ్డి, 32వ వార్డు కార్పొరేటర్ శ్రీధర్, ఐటీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు గట్టు తిలక్ తదితరులు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #2-189, journalist colony, lakshmi narasimha swamy temple back side, Pulivendula Town, Y.S.R Kadapa District, Andhra Pradesh -PinCode:-516390, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:- APTEL/26/A6827 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

అక్రమ గ్రావెల్ తవ్వకాలపై హిందూ ఎస్సీ ఎస్టీ పరిరక్షణ సమితి పోరాటం ఫలితం





జగన్నాథ గట్టులో మైనింగ్ అధికారుల దాడులు.. మూడు హిటాచీలు, ఒక టిప్పర్, ఒక ట్యాంకర్ సీజ్.. తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు గ్రామ పరిధిలోని జగన్నాథ గట్టు సమీపంలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై హిందూ ఎస్సీ ఎస్టీ పరిరక్షణ సమితి చేసిన ఫిర్యాదుపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవడం హర్షణీయమని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు ప్రతాప్ తెలిపారు.వ్యవసాయ భూమిని చదును చేసుకునే పేరుతో కొండ ప్రాంతంలో భారీ యంత్రాలను ఉపయోగిస్తూ గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారనే విషయాన్ని గుర్తించిన తమ సమితి, అక్టోబర్ 30వ తేదీన కర్నూలు రూరల్ పోలీస్ అధికారులకు అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదులో మైన్స్ అండ్ జియాలజీ శాఖ నుంచి అవసరమైన అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు, రవాణా జరుగుతున్నాయనే అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.తమ ఫిర్యాదు నేపథ్యంలో మైన్స్ అండ్ జియాలజీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో దాడులు నిర్వహించి మూడు హిటాచీలు, ఒక టిప్పర్, ఒక ట్యాంకర్‌ను సీజ్ చేయడంతో పాటు ఈ వ్యవహారంపై కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

రెవెన్యూ సిఫార్సు లేఖే మైనింగ్ అనుమతి అవుతుందా?

ఈ వ్యవహారంలో భూ యజమానులు వ్యవసాయ భూమిని చదును చేసుకునేందుకు అనుమతి కోరుతూ రెవెన్యూ అధికారులను ఆశ్రయించినట్లు తమ పరిశీలనలో వెల్లడైందని ప్రతాప్ తెలిపారు. ఈ నేపథ్యంలో కర్నూలు రూరల్ తహసీల్దార్ 25-08-2026న ఆర్ సి .బి .255/2026 ద్వారా జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారికి లేఖ రాశారని, గ్రావెల్ రవాణా అనుమతిని సంబంధిత నిబంధనలు, రాయల్టీ చెల్లింపులకు లోబడి పరిశీలించాలని అందులో పేర్కొన్నారని తెలిపారు.అయితే రెవెన్యూ శాఖ నుంచి వచ్చిన సిఫార్సు లేఖ ఆధారంగా మాత్రమే గ్రావెల్ తవ్వకాలు, రవాణా చేపట్టడానికి వీలుంటుందా? మైనింగ్ శాఖ నుంచి వాస్తవంగా అనుమతులు మంజూరయ్యాయా? అనుమతులు మంజూరైతే ఎంత పరిమాణంలో గ్రావెల్ తవ్వడానికి అనుమతి ఇచ్చారు? నిర్దిష్ట పరిమితులకు లోబడే తవ్వకాలు జరిగాయా? ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ చెల్లించారా? రవాణాకు అవసరమైన ఈ-ట్రాన్సిట్ పాసులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ భూమి చదును పేరుతో సహజ వనరుల దుర్వినియోగం జరగకూడదు వ్యవసాయ భూమిని చదును చేసుకోవడానికి చట్టబద్ధమైన అనుమతులు తీసుకుంటే తమ సమితికి ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే ఆ పేరుతో భారీ స్థాయిలో గ్రావెల్ తవ్వకాలు జరిపి తరలించడం జరిగితే దానిపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాల్సిందేనని మల్లెపోగు ప్రతాప్ స్పష్టం చేశారు.భూమి చదును పేరుతో ఎంత మేరకు గ్రావెల్ తవ్వారు? ఎంత పరిమాణంలో బయటకు తరలించారు? తవ్వకాలకు అనుమతించిన భూమి పరిధి ఎంత? వాస్తవంగా తవ్వకాలు జరిగిన విస్తీర్ణం ఎంత? అనే అంశాలను మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిగినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వాహనాల సీజ్‌తోనే విచారణ ఆగిపోకూడదు

అధికారులు మూడు హిటాచీలు, ఒక టిప్పర్, ఒక ట్యాంకర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేయడం ఈ వ్యవహారంలో కీలక పరిణామమని సమితి పేర్కొంది. అయితే కేవలం వాహనాలను సీజ్ చేయడంతోనే విచారణ ముగియకూడదని, అక్రమ తవ్వకాల వెనుక ఉన్న పూర్తి వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకురావాలని కోరింది. అనుమతులు ఇచ్చిన విధానం, తవ్వకాల పరిమాణం, గ్రావెల్ తరలింపు, రాయల్టీ చెల్లింపులు, రవాణా పత్రాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేసింది.ప్రజా ప్రయోజనాలు, సహజ వనరుల పరిరక్షణ కోసం హిందూ ఎస్సీ ఎస్టీ పరిరక్షణ సమితి నిరంతరం పనిచేస్తుందని, ఎక్కడైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టపరమైన చర్యలు జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని మల్లెపోగు ప్రతాప్ స్పష్టం చేశారు.

రాప్తాడు ఘటన నిందితుడికి కర్నూలు గవర్నమెంట్ హాస్పిటల్ లో చికిత్స

కర్నూల్ సిటీ నంది పత్రిక అనంతపురం జిల్లా రాప్తాడు పాఠశాల తరగతి గదిలో విద్యార్థినిపై ఎలక్ట్రిక్ రంపంతో దాడి చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో నిందితుడిగా ఉన్న హేమంత్ గత కొద్ది రోజులుగా అనంతపురంలో చికిత్స పొందుతుండగా, మెరుగైన వైద్య సేవల నిమిత్తం శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకురావడం జరిగింది.ఆసుపత్రికి చేరుకున్న వెంటనే సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు , సీ.ఎం.ఓ లు, డ్యూటీ సర్జన్, డ్యూటీ అసిస్టెంట్ సర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్, డ్యూటీ కార్డియో థొరాసిక్ సర్జన్ మరియు కార్డియాలజీ వైద్య బృందం రాత్రి వేళలోనే రోగిని పరిశీలించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు.పరీక్షల్లో రోగి ఊపిరితిత్తుల్లోని కొన్ని రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టినట్లు గుర్తించారు. దీంతో వైద్య నిపుణులు తదుపరి పరీక్షలు నిర్వహించి, ఊపిరితిత్తుల్లో ఏర్పడిన రక్తపు గడ్డలను కరిగించేందుకు అవసరమైన చికిత్సను ప్రస్తుతం అందిస్తున్నారు. శనివారం ఉదయం సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు రోగి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ప్రస్తుతం రోగి పరిస్థితి నిలకడగా ఉందని, అనంతపురం నుండి వచ్చినప్పుడు కొంత ఆయాసం ఉన్నప్పటికీ కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చేరుకున్న అనంతరం ప్రస్తుతం ఆయాసం లేదని వైద్యుల పర్యవేక్షణలో మెరుగైన చికిత్స కొనసాగుతోందని తెలిపారు.ఈ సందర్భంగా సంబంధిత వైద్యాధికారులు, వైద్య బృందానికి సూపరింటెండెంట్ పలు సూచనలు చేశారు. రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, 24 గంటల పాటు నిరంతర పర్యవేక్షణలో ఉంచి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు.రోగికి అవసరమైన అన్ని వైద్య సేవలను అందిస్తూ ప్రత్యేక శ్రద్ధతో చికిత్స కొనసాగిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా కె వెంకటేశ్వర్లు తెలిపారు.

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కర్నూల్ కలెక్టర్ డాక్టర్ సిరి



ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 14, నంది పత్రిక ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని శనివారం కర్నూల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ విశేషాలను తెలుసుకుని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అహోబిలం దేవస్థానం సిఎఒ మాదవాన్, ఏపీ టూరిజం మేనేజర్ గోపాల్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులు, భద్రత, ఆరోగ్యం, విద్యకు ప్రభుత్వం పెద్దపీట.

విద్యార్థులు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను సాధించాలి

బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి.

బాల్యవివాహ రహిత భారత్ నిర్మాణమే లక్ష్యంగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం బ్యూరో చీఫ్, నవంబర్ 14 నంది పత్రిక బాల్యవివాహాల నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ, బాలల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు.శనివారం భీమవరంలోని డి.ఎన్.ఆర్. కళాశాలలో నిర్వహించిన బాలల దినోత్సవం, బాల్యవివాహ రహిత భారత్ అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. జాతీయ బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థినీ విద్యార్థులందరికీ జాతీయ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశ ప్రథమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు.పిల్లలపై వేధింపులు జరిగినప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని అన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉంటూ చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, వారి ఆరోగ్యం, విద్య, భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు పిల్లలంటే ఎంతో ప్రేమాభిమానాలు ఉండేవని, పిల్లలతో సమయం గడపడం, వారి సమస్యలను తెలుసుకోవడం, వారిని ప్రోత్సహించడం ఆయనకు ఎంతో ఇష్టమైన విషయాలని కలెక్టర్ గుర్తు చేశారు. బాలల సమస్యలు, వారి ఆశయాలు, అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు వారిని ప్రోత్సహించేందుకు ఇలాంటి వేడుకలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతి బాలబాలికకు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, సమాజంలో భాగస్వామ్యమయ్యే హక్కు ఉన్నాయని స్పష్టం చేశారు. బాలల హక్కులను గౌరవించడం, వారి అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పాలు, పప్పులు, బియ్యం తదితర పౌష్టికాహార పదార్థాలను అందిస్తూ చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు కృషి చేస్తోందన్నారు. పిల్లలకు సరైన పోషకాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక అభివృద్ధికి బాటలు వేయవచ్చని తెలిపారు.

పోక్సో చట్టంపై ప్రతి విద్యార్థికి అవగాహన అవసరం. బాలల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, వారిని లైంగిక వేధింపుల నుంచి రక్షించేందుకు పోక్సో చట్టాన్ని అమలు చేస్తోందని తెలిపారు . పిల్లలపై జరిగే లైంగిక నేరాలను అరికట్టడం, బాధిత బాలబాలికలకు న్యాయం కల్పించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని వివరించారు.పిల్లలు తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అపరిచితులు లేదా తెలిసిన వ్యక్తులు అనుచితంగా ప్రవర్తించినా, తప్పుగా తాకినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. ఇలాంటి ఘటనల్లో తప్పు పిల్లలది కాదని, తప్పు చేసిన వారిదేనని స్పష్టం చేశారు. బాలల భద్రతపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే క్రమశిక్షణతో కూడిన జీవనశైలి అలవర్చుకోవాలని సూచించారు. బాలల హక్కులను గౌరవిస్తూ బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేష్, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి అనిల్ కుమార్, సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్యామ్ సుందర్, డి.ఎన్.ఆర్. కళాశాల కార్యదర్శి రామకృష్ణ రాజు, వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరైనారు.



పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా రూ.33 లక్షలతో 11 మంది మత్స్యకారులకు ఐస్ బాక్స్‌తో కూడిన త్రిచక్ర వాహనాల పంపిణీ.





మత్స్యకారుల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

భీమవరం, బ్యూరో చీఫ్ నవంబర్,14 నంది పత్రిక మత్స్యకారులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. శనివారం భీమవరం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద మంజూరైన ఐస్ బాక్స్‌తో కూడిన 11 త్రిచక్ర వాహనాలను జిల్లా కలెక్టర్ చేతులుమీదుగా అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ జండా ఊపి వాహనాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద మత్స్యకారులకు ఐస్ బాక్స్‌తో కూడిన త్రిచక్ర వాహనాలను పంపిణీ చేయడం ద్వారా వారి జీవనోపాధికి మరింత భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. 2015-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 11 మంది మత్స్యకారులకు ఈ వాహనాలను పంపిణీ చేయటం జరిగిందన్నారు. రూ.33 లక్షల విలువైన వాహనాలను లబ్ధిదారులకు ప్రభుత్వ సబ్సిడీ క్రింద రూ.18 లక్షలు ఇవ్వటం జరిగిందన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాయోజిత పథకం కింద ఒక్కో త్రిచక్ర వాహనం యూనిట్ వ్యయాన్ని రూ.3 లక్షలుగా నిర్ణయించారని, ఈ పథకంలో జనరల్ కేటగిరీ లబ్ధిదారులకు 40 శాతం, ఎస్సీ, ఎస్టీ, మహిళా లబ్ధిదారులకు 60 శాతం చొప్పున ప్రభుత్వ సబ్సిడీ అందిస్తున్నారన్నారు. ఈ పథకం కింద జిల్లాలో మొత్తం 11 మంది లబ్ధిదారులకు రూ.33 లక్షల విలువైన త్రి చక్ర వాహనాలను పంపిణీ చేయగా, వీటికి సంబంధించి రూ.18 లక్షల ప్రభుత్వ సబ్సిడీ అందించటంజరిగిందన్నార.

సామాజిక వర్గాల వారీగా 11 మంది

వాహనాలు పొందిన లబ్ధిదారుల వివరాలు:

జనరల్ కేటగిరీ 3 మంది

ఎస్సీ కేటగిరీ 5 మంది

ఎస్టీ కేటగిరీ 1 మంది

మహిళా కేటగిరీ 2 మంది

ఈ విధంగా అన్ని వర్గాల మత్స్యకారులకు ప్రభుత్వ పథకం ద్వారా ఆర్థిక చేయూత అందించడంతో పాటు, స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఐస్ బాక్స్‌తో కూడిన ఈ ప్రత్యేక త్రిచక్ర వాహనాల ద్వారా మత్స్యకారులు చేపలను పరిశుభ్రమైన, సురక్షితమైన పద్ధతిలో రవాణా చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. చేపలు ఎక్కువ సమయం తాజాగా ఉండటంతో పాటు, నాణ్యత దెబ్బతినకుండా మార్కెట్‌కు చేరవేయడానికి వీలవుతుందన్నారు.

దీనివలన మత్స్యకారులకు మెరుగైన ఆదాయం లభిస్తుందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన తాజా చేపలు అందుబాటులోకి రావడంతో పాటు, మత్స్యకారులు తమ ఉత్పత్తులను నేరుగా మార్కెట్‌కు తీసుకువెళ్లి మెరుగైన ధరలు పొందేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. మధ్యవర్తులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించుకోవడంతో పాటు, చేపల విక్రయాల ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ఈ వాహనాలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

మత్స్య రంగ అభివృద్ధికి ప్రభుత్వ ప్రత్యేక ప్రాధాన్యత

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ప్రధాన ఉద్దేశ్యం మత్స్య రంగంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, చేపల ఉత్పత్తి, నిల్వ, రవాణా, మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేయడం, మత్స్యకారుల ఆర్థిక, సామాజిక స్థితిగతులను మెరుగుపరచడం అన్నారు. అర్హులైన మత్స్యకారులకు ప్రభుత్వ సబ్సిడీతో కూడిన వాహనాలను అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. గ్లోరీ, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.









మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు ప్రశాంత వాతావరణంలో

ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు





భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లులో 188 వార్డులకు ఎన్నికలు.

443 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు 87 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు

నవంబర్ 26న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం , నవంబర్,14 నంది పత్రిక పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు పట్టణాల్లో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.శనివారం భీమవరం మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఎన్నికల నియమావళిని పూర్తిస్థాయిలో పాటిస్తూ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

ఎన్నికల షెడ్యూల్ వివరాలు.

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 14, 15, 16 తేదీలలో మూడు రోజులపాటు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతుంది. నవంబర్ 17వ తేదీన నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) నిర్వహిస్తారు. నవంబర్ 19వ తేదీన పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.

నవంబర్ 26, 2026న పోలింగ్ నిర్వహించనుండగా, నవంబర్ 30, 2026న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

నాలుగు మున్సిపాలిటీల్లో 188 వార్డులు

443 పోలింగ్ స్టేషన్లు

భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 188 వార్డులు ఉన్నాయి. ఈ నాలుగు పట్టణాల్లో ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 443 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించటం జరిగిందన్నారు. ఇందులో 40 హైపర్‌సెన్సిటివ్ (అత్యంత సమస్యాత్మక) పోలింగ్ స్టేషన్లు, 47 సెన్సిటివ్ (సమస్యాత్మక) పోలింగ్ స్టేషన్లు కలిపి మొత్తం 87 కేంద్రాలను గుర్తించామన్నారు. ఆయా కేంద్రాల్లో అవసరమైన అదనపు భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతోపాటు నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.భీమవరం మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్లకు ప్రత్యేక ఏర్పాట్లు.భీమవరం మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎన్నికల అధికారులకు సంబంధించి 13 టేబుళ్లు, వార్డు సభ్యుల అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు 52 టేబుళ్లు, చైర్మన్ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు ఒక ప్రత్యేక టేబుల్ ఏర్పాటు చేశారు.అభ్యర్థులు నిర్దిష్ట గడువులో, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా తమ నామినేషన్లను దాఖలు చేసుకోవాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి అవసరమైన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పోలీసు, రెవెన్యూ యంత్రాంగం సమన్వయం.

నాలుగు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ప్రక్రియను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాయన్నారు. సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయడంతోపాటు ఎన్నికల ప్రక్రియ మొత్తం పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత కీలకమైనవని, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియకు సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీలకు ఆర్థిక ప్రోత్సాహకాలు

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 14 నంది పత్రికస్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా

గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికలు, 2026 సర్పంచ్, అన్ని వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీలకు ఆర్థిక ప్రోత్సాహకాలు భారీగా పెంపు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

శనివారం ఉత్తర్వులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఏకగ్రీవ ఎన్నికలను ప్రోత్సహించడం ద్వారా సామాజిక సామరస్యాన్ని పెంపొందించడం, వర్గ విభేదాలు, ఎన్నికల వివాదాలను తగ్గించడం, గ్రామ స్థాయిలో ఏకాభిప్రాయాన్ని సాధించడం, భాగస్వామ్య స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేయడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని అన్నారు.

ప్రోత్సాహక మొత్తాల పెంపు వివరాలు.

రాబోయే గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికలు, 2026 దృష్ట్యా ప్రభుత్వం గతంలో ఉన్న ప్రోత్సాహక మొత్తాలను సవరించి కింది విధంగా పెంచింది:

ఎన్నికల కోసం పెంచిన ప్రోత్సాహకం

5,000 జనాభా వరకు రూ. 15 లక్షలు,

5,001 నుంచి 10,000 జనాభా వరకు రూ. 25 లక్షలు,

10,000 కు పైబడి వున్న జనాభా రూ. 50 లక్షలు. ప్రోత్సాహకం ఇవ్వడం జరుగుతుందన్నారు.

అమలు మరియు మంజూరుకు సంబంధించిన ముఖ్యమైన షరతులు సమర్థులైన ఎన్నికల అధికారుల ద్వారా సర్పంచ్, అన్ని వార్డు సభ్యుల స్థానాలు అధికారికంగా ఏకగ్రీవమైనట్లు ప్రకటించబడిన గ్రామ పంచాయతీలకు మాత్రమే ఈ ప్రోత్సాహకం వర్తిస్తుందన్నారు.నిధులు విడుదల చేయడానికి మునుపు సంబంధిత సమర్థ అధికారుల ద్వారా గ్రామ పంచాయతీల అర్హత కచ్చితంగా ధృవీకరించబడాలి. నిధుల వినియోగం: ఈ ప్రోత్సాహక మొత్తాన్ని కేవలం ఆమోదించబడిన అభివృద్ధి కార్యకలాపాలు, ప్రజా సంక్షేమ పనుల కొరకు మాత్రమే, నిర్దేశిత ఆర్థిక, అకౌంటింగ్, ఆడిట్ నిబంధనలకు లోబడి ఉపయోగించాలి.

విడతల వారీ చెల్లింపు: ఈ పెంచిన ప్రోత్సాహక మొత్తాన్ని ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ పదవీకాలంలో విడతలవారీగా చెల్లించడం జరుగుతుంది.

స్వేచ్ఛకు భంగం లేదు: ఏ వ్యక్తి అయినా ఎన్నికలలో పోటీ చేయడానికి ఉన్న చట్టబద్ధమైన హక్కును లేదా ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా మరియు స్వతంత్రంగా వినియోగించుకునే హక్కును ఈ పథకం ఏ విధంగానూ అడ్డుకోదన్నారు.

అధికారులకు ఆదేశాలు రాబోయే గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికలు, 2026 కొరకు మాత్రమే ఈ ఉత్తర్వులు ప్రత్యేకంగా వర్తిస్తాయన్నారు.

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ, స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ



పాలకొల్లు బ్యూరో చీఫ్ నవంబర్ 14 నంది పత్రిక పాలకొల్లు మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను, స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ఏర్పాటు చేసిన కేంద్రాలను సందర్శించి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ల స్వీకరణ చేపట్టాలని, అభ్యర్థులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తూ పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఏ ఎస్ ఎన్ ఎం డిగ్రీ కళాశాల యందు స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి, ఎన్నికల సామగ్రి భద్రతకు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు మరియు నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ విధులు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.





పుస్తక పఠనంతోనే విజ్ఞానం నైతిక విలువలు పెంపొందుతాయి.





గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు.

విద్యార్థులు ప్రతిరోజూ న్యూస్ పేపర్లు, జీవిత చరిత్రలు చదవడం అలవాటు చేసుకోవాలి.

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం.

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

భీమవరం, బ్యూరో చీఫ్ నవంబర్14, నంది పత్రికపుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు, నైతిక విలువలను అలవర్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యార్థులకు సూచించారు. శనివారం భీమవరం వన్ టౌన్‌లో డాక్టర్ బి.వి. రాజు పార్కు సమీపంలోని ప్రధమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు.తోలుత విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం భారత మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విభిన్న అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదవడం ద్వారా విస్తృతమైన జ్ఞానాన్ని, సమాజం పట్ల అవగాహనను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లో లభించని అనేక విషయాలను తెలుసుకోవడానికి ప్రతిరోజూ న్యూస్ పేపర్లు చదవడాన్ని ఒక మంచి అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. నిత్యం వార్తాపత్రికలు చదవడం వల్ల సమాజంలో జరుగుతున్న పరిణామాలు, దేశ విదేశాల్లో చోటుచేసుకుంటున్న ముఖ్యమైన సంఘటనలు, వివిధ రంగాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. చదువును కేవలం పరీక్షల ఒత్తిడిగా భావించకుండా, ఇష్టంతో, ఆసక్తితో చదవాలని తెలిపారు. కథలు చదివినంత ఆసక్తికరంగా పుస్తకాలను చదివే అలవాటు చేసుకుంటే చదువుపై ఏకాగ్రత పెరిగి, మెరుగైన ఫలితాలు సాధించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రత్యేక నైపుణ్యం, సృజనాత్మక ఆలోచన దాగి ఉంటుందని, వాటిని వెలికితీయడానికి పాఠ్యపుస్తకాలతో పాటు వివిధ విజ్ఞానదాయక పుస్తకాలను చదవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం రచించిన 'వింగ్స్ ఆఫ్ ఫైర్', జాతిపిత మహాత్మా గాంధీ రచించిన 'మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్' వంటి మహనీయుల జీవిత చరిత్రలను గ్రంథాలయాల్లో చదవాలని సూచించారు.మహనీయుల జీవిత ప్రయాణం, వారు ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలు విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయని, వారి అనుభవాల నుంచి ఎన్నో మంచి విషయాలను నేర్చుకోవచ్చని తెలిపారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించుకుని సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు హితవు పలికారు. భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక కాలంలో సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా ప్రభావం కారణంగా పిల్లల్లో పుస్తక పఠన అలవాటు గణనీయంగా తగ్గిపోతోందని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరమైన మేరకు వినియోగించుకుంటూనే, పుస్తక పఠనానికి కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను గ్రంథాలయాలకు తీసుకువెళ్లి, అక్కడ కొంత సమయం గడిపేలా ప్రోత్సహించాలని కోరారు. గ్రంథాలయాల్లో వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదవడం వల్ల పిల్లల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మకత, రచనా నైపుణ్యాలు మెరుగుపడతాయని తెలిపారు. అంతేకాకుండా ప్రపంచ వ్యవహారాలపై విస్తృత అవగాహన ఏర్పడి, వారి వ్యక్తిత్వ వికాసానికి పుస్తక పఠనం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు, యువత వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం మండల తహసీల్దార్ రావి రాంబాబు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు అల్లూరి నరసింహారాజు, మానవతా సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు, అధ్యక్షులు ఎస్.ఎస్.ఎన్. రాజు, కో-చైర్మన్ కారుమూరి నరసింహమూర్తి బాబు, కలిగొట్ల గోపాల శర్మ, గ్రంధి కుమార వెంకటేశ్వర వరప్రసాద్, వడ్డి వెంకటేశ్వరరావు, డి.వి.ఎస్. చంద్రాజీ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సంయుక్త కార్యదర్శి అల్లు శ్రీనివాస్, గ్రంథాలయ అధికారి ఎస్. వెంకటేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది సోమరాజు తదితరులు పాల్గొన్నారు.





గిరిబాబు మృతిపై చిరంజీవి, బాలకృష్ణ స్పందన

ప్రముఖ సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూయడంతో టాలీవుడ్‌లో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన మరణవార్త తెలుసుకున్న సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ అగ్ర కథానాయకులు మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణలు గిరిబాబు మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ భావోద్వేగ నివాళులర్పించారు. గిరిబాబుతో తమకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు.గిరిబాబు మరణం పట్ల బాలకృష్ణ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన సినీ ప్రస్థానం తొలినాళ్లలోనే గిరిబాబుతో కలిసి 'అన్నదమ్ముల అనుబంధం' సినిమాలో నటించిన క్షణాలను ఆయన ఈ సందర్భంగా నెమరువేసుకున్నారు. ఆ తర్వాత కూడా తన కెరీర్‌లో వచ్చిన ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో గిరిబాబు కీలక పాత్రలు పోషించారని తెలిపారు. గిరిబాబు కేవలం నటుడిగానే కాకుండా మంచి వ్యక్తి అని కీర్తించారు. ఆయన దర్శకుడిగా, నిర్మాతగా కూడా తెలుగు సినిమాకు విశేష సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, గిరిబాబు కుమారుడు నటుడు రఘుబాబుతో పాటు వారి కుటుంబ సభ్యులకు బాలకృష్ణ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మరోవైపు మెగాస్టార్ చిరంజీవి సైతం గిరిబాబు మరణవార్త విని తీవ్ర ఆవేదన చెందారు. గిరిబాబు మృతి తనను ఎంతగానో కలచివేసిందని ఆయన పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా

సుప్రీంకోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేయాలి





- ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు అందజేత.

- ఏకగ్రీవ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి బెదిరింపులు, ఒత్తిళ్లు, బలవంతపు చర్యలకు తావుండకూడదు.

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా.

తిరుపతి, బ్యూరో చీఫ్ నవంబర్ 14 నంది పత్రిక: రాష్ట్రంలో రానున్న పట్టణ స్థానిక సంస్థలు (యు ఎల్ బి ఎస్), గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రతి అభ్యర్థి స్వేచ్ఛగా నామినేషన్ దాఖలు చేసుకునేలా, ప్రతి ఓటరు నిర్భయంగా తన ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా గారు స్పష్టం చేశారు.శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ నందు రాష్ట్రం లోని 12 జిల్లాల ఎస్ పి లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా పట్టణ స్థానిక సంస్థలు(యు ఎల్ బి ఎస్), గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ పై ఏడిజి (లా అండ్ ఆర్డర్) మధుసూదన్ రెడ్డి, ఐపిఎస్., ఐజిపి రాజకుమారి ఐపిఎస్., మరియు ఎన్నికల పరిశీలకులు వర ప్రసాద్ లతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్,ఐఏఎస్., జిల్లా ఎస్పి ఎల్.సుబ్బారాయుడు, ., అనంతపురం, కర్నూల్ రేంజ్ ఐజిపి లు షిమోషీ ., డిఐజీ కే. ప్రవీణ్ తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వై.ఎస్.ఆర్ కడప, కర్నూల్, నంద్యాల జిల్లాల ఎస్పి లు ఈ సమావేశానికి నేరుగా పాల్గొనగా, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, శ్రీ సత్య సాయి, అనంతపురం ఎస్పి లు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్ పి లు తమ జిల్లా పరిధిలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన బందోబస్తు, తదితర వివరాలను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత కీలకమని, నామినేషన్ల స్వీకరణ నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో ఎన్నికల అధికారులు, జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా గతంలో అన్నమయ్య జిల్లాలో హింసాత్మక ఘటనలు చోటుచేసున్నాయని, ఎస్పి వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని, మరికొన్ని జిల్లాల్లో అధికారులు ఒత్తిళ్ల మధ్య విధులు నిర్వహించినప్పటికీ, ఎన్నికల నిబంధనల అమలులో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. సాధారణ నామినేషన్ కేంద్రాలతో పాటు జిల్లా కలెక్టరేట్‌ను కూడా నామినేషన్ కేంద్రంగా ఏర్పాటు చేయడం ద్వారా అభ్యర్థులు ఎలాంటి ఆటంకాలు లేకుండా నామినేషన్లు దాఖలు చేసే అవకాశం కల్పించామని వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ అత్యంత సమర్థవంతమైన సమన్వయంతో చేపట్టిన చర్యలు ప్రశంసనీయమని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అభినందించారు. తిరుపతి జిల్లాలో అమలు చేసిన ఈ సమన్వయ విధానం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇతర జిల్లాలకు మార్గదర్శకంగా నిలవాలని, ఇదే నిబద్ధతతో ప్రతి అభ్యర్థికి భద్రత, ప్రతి ఓటరుకు స్వేచ్ఛ కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.రానున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధారణ నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని కలెక్టర్, ఎస్పీలు భావిస్తే, వెంటనే జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా అందుబాటులో ఉన్న పోలీసు బలగాలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ప్రతి మండలంలో రెండు లేదా మూడు గ్రామాలను కలిపి క్లస్టర్ స్థాయిలో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి భద్రత కల్పించాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే ప్రతి అభ్యర్థికి అవసరమైన పోలీసు రక్షణ కల్పించాలని, అభ్యర్థులు కోరిన మేరకు భద్రత కల్పించి ఎలాంటి భయం లేదా ఒత్తిడి లేకుండా నామినేషన్లు దాఖలు చేసేలా చూడాలన్నారు. నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద తప్పనిసరిగా సీసీటీవీ నిఘా, వీడియోగ్రఫీ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అందే ఫిర్యాదులు, వినతులను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ఉల్లంఘనకు సంబంధించి అభ్యర్థులు తిరిగి న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యే పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసిందని తెలిపారు. 2,000 నుంచి 5,000 లోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.15 లక్షలు, 5,001 నుంచి 10,000 లోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.25 లక్షలు, 10,000కు పైగా జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.50 లక్షలు నగదు ప్రోత్సాహం అందించడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీలో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నిక అయిన పంచాయతీలకు ఈ ప్రోత్సాహకాలు అందించడం జరుగుతుందన్నారు. తిరుపతి జిల్లా పరిధిలో ఎన్నికలకు గుర్తింపు పొందిన మొత్తం 777 గ్రామ పంచాయతీల్లో సుమారు 200 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఏకగ్రీవ పంచాయతీల సంఖ్య పెరగడం వల్ల ఎన్నికల బందోబస్తుకు అవసరమైన అదనపు పోలీసు బలగాలను ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో వినియోగించుకునేందుకు వెసులుబాటు కలుగుతుందని పేర్కొన్నారు. అయితే, ఏకగ్రీవ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి బెదిరింపులు, ఒత్తిళ్లు, బలవంతపు చర్యలకు తావుండకూడదని, ఎన్నికలు పూర్తిగా స్వచ్ఛందంగా, పారదర్శకంగా జరగాలని అధికారులకు సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును పునఃసమీక్షించి అదనపు బలగాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఏడిజి మాట్లాడుతూ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమైందని స్పష్టం చేశారు. గతంలో కడప జిల్లాలో తలెత్తిన శాంతిభద్రతల సమస్యను ఉన్నతాధికారులు స్వయంగా క్షేత్రస్థాయికి చేరుకుని, సరైన భద్రతా ఏర్పాట్లతో ముందుండి సమర్థవంతంగా నియంత్రించిన తీరును ఈ సందర్భంగా ప్రస్తావించారు. అదే స్ఫూర్తితో, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలతో రాబోయే స్థానిక సంస్థలు మరియు గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఐజిపి రాజకుమారి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఇప్పటివరకు మొత్తం 1,182 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. వీటిలో 254 ప్రత్యక్ష ఫిర్యాదులు, 810 ఈ-మెయిల్స్, 218 ఫోన్ కాల్స్ ద్వారా అందాయి. అత్యధికంగా కడప జిల్లాలో 278, తిరుపతిలో 136, అన్నమయ్యలో 132 ఫిర్యాదులు నమోదయ్యాయన్నారు. నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ సమయంలో అభ్యర్థులపై దాడులు, బెదిరింపులు, అడ్డుకోవడం, కిడ్నాప్, నామినేషన్ పత్రాలను చింపివేయడం వంటి ఫిర్యాదులపై క్షేత్రస్థాయి నివేదికలు తెప్పించి తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రాల్లోని సీసీటీవీ ఫుటేజీలను భద్రపరచడంతో పాటు, పోలింగ్ రోజున ఏజెంట్లను అడ్డుకోవడం, విలేకరులపై దాడుల ఘటనలను కూడా తీవ్రంగా పరిగణించి చర్యలు చేపట్టినట్లు ఐజీ గారు వివరించారు.





చరిత్ర వక్రీకరణకే వారోత్సవాల్లో మార్పు

దేశంలో 75 ఏళ్లుగా నిర్విరామంగా కొనసాగుతున్న ఒక గొప్ప చారిత్రక సంప్రదాయానికి కేంద్ర ప్రభుత్వం అనూహ్యంగా తెరదించింది. ప్రతి ఏటా నవంబర్ 14 నుంచి 20 వరకు దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించే జాతీయ సహకార వారోత్సవాలను నిలిపివేస్తున్నట్లు నిర్ణయించడం తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది. భారత తొలి ప్రధాని, ఆధునిక దేశ నిర్మాత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి అయిన నవంబర్ 14న ఈ వేడుకలు ప్రారంభం కావడం దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఇప్పుడు వారోత్సవాల తేదీల మార్పు పూర్తిగా అసంబద్ధం. నెహ్రూ జ్ఞాపకార్థాన్ని, ఆయన పేరును ప్రజల మనసుల నుంచి పూర్తిగా తుడిచిపెట్టే దురుద్దేశంతోనే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.భారత సహకార ఉద్యమానికి నెహ్రూ చేసిన సేవలు ఒక వారోత్సవానికి పరిమితమైనవి కావు. సహకార రంగాన్ని కేవలం రుణాలు ఇచ్చిపుచ్చుకునే ఆర్థిక వ్యవస్థగా కాకుండా గ్రామీణ ప్రజల జీవన వికాసానికి, సమసమాజ నిర్మాణానికి బలమైన సాధనంగా ఆయన భావించారు. స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తర్వాత కూడా దేశంలో సహకార ఉద్యమానికి నెహ్రూ అరుదైన సేవలు అందించారు. ఆగ్నేయాసియా సహకార నాయకత్వంపై అంతర్జాతీయ సదస్సులో ఆయన చేసిన ప్రసంగం ఈ దార్శనికతకు నిదర్శనం. వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమలు, మార్కెటింగ్, పంపిణీ, నీటిపారుదల తదితర రంగాల్లో సహకారాన్ని విస్తరించేందుకు పంచవర్ష ప్రణాళికల్లోనూ నెహ్రూ ప్రాధాన్యమిచ్చారు.సహకార విధానం భారతదేశ సాధారణ ఆలోచనగా మారాలి' అని కలలుగన్న మహనీయుడు నెహ్రూ. అందుకే దేశంలోని సహకారవాదులు, రైతులు ఆయన్ను 'సహకార ప్రవక్త'గా కొలిచారు. అలాంటి మహానుభావుడి పేరుతో ముడిపడిన వారోత్సవాలను అర్ధంతరంగా రద్దుచేయడం పూర్తిగా అప్రజాస్వామికం, అసంబద్ధం. కేంద్రం తీసుకొచ్చిన కొత్త మంత్రిత్వశాఖ పేరుతో, జూన్ 29 నుంచి జూలై 6 మధ్య కొత్తగా వారోత్సవాలు జరపాలని నిర్ణయించడం కేవలం ఒక తేదీ మార్పు మాత్రమే కాదు, చరిత్రను వక్రీకరించే రాజకీయ కక్ష సాధింపు చర్యగా స్పష్టమవుతోంది. ఏడేళ్ల క్రితం ఏర్పాటైన ఒక మంత్రిత్వ శాఖ ఆవిర్భావ దినోత్సవాన్ని తెరపైకి తెచ్చి, దేశవ్యాప్తంగా ప్రజల జీవితాల్లో భాగమైన 75 ఏళ్ల చారిత్రక సంప్రదాయాన్ని తుడిచేయాలని చూడటం. పాలకుల సంకుచిత మనస్తత్వాన్ని ఎత్తిచూపుతోంది. అధికారంలో ఉన్నామనే అహంకారంతో దేశ నిర్మాణంలో భాగస్వాములైన నాయకుల ముద్రలను చెరిపేయాలని చూడటం చరిత్రను అవమానించడమే.నెహ్రూ సహకార దృక్పథంలోని అసలైన గొప్పదనం దాని ప్రజాస్వామిక స్వభావంలో ఉంది. 'సహకార సంఘాలను ప్రభుత్వ అధికారులు నిర్వహించకూడదు. అది పూర్తిగా ప్రజలు, సభ్యుల బాధ్యతగా ఉండాలి' అని ఆయన దృఢంగా నమ్మారు. ప్రభుత్వాలు ఈ రంగంలో జోక్యం చేసుకుంటే సహకార సంఘాల ఆత్మ, స్వభావం, ప్రాథమిక విలువలు దెబ్బతింటాయని హెచ్చరించారు. గ్రామస్వరాజ్యం, గ్రామీణ పరిశ్రమలు, చిన్న రైతులు ఆర్థికంగా బలోపేతం కావడం కోసం సహకారాన్ని శక్తిమంతమైన సాధనంగా చూశారు. సహకారం అంటే పై నుంచి విధించే పాలనా విధానం కాదు. కింది స్థాయి ప్రజలు స్వచ్ఛందంగా నిర్మించుకునే వ్యవస్థ అనేది ఆయన విశ్వాసం. స్వచ్ఛందం, స్వయంప్రతిపత్తి, సామాజిక సమన్వయం, పరస్పర ఆర్థిక స్వావలంబన అనే నాలుగు మూలస్తంభాల పైనే సహకార ఉద్యమం నిలబడాలని నెహ్రూ ఆకాంక్షించారు. శ్వేతవిప్లవ పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్ సైతం నెహ్రూ సహకార దార్శనికతను కొనియాడారు. దేశంలో లక్షలాది సంఘాలు ఉండటం ముఖ్యం కాదని, ప్రజల ఆలోచనా విధానమే సహకారమయం కావాలని నెహ్రూ కోరుకున్నారని కురియన్ ఒక సందర్భంలో గుర్తు చేశారు. మహాత్మాగాంధీ గ్రామస్వరాజ్యం కల సాకారానికి సహకార రంగమే ఉత్తమ మార్గమని విశ్వసించిన నెహ్రూ ఆశయాలను నేడు అధికారంలో ఉన్నవారు కాలరాస్తున్నారు. వికేంద్రీకరణను బలపరచాల్సిన ప్రభుత్వమే, సహకార రంగాన్ని కేంద్రీకృతం చేసి రాజకీయ

రోడ్డు ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి

హోం మంత్రి వంగలపూడి అనిత

అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం బ్యూరో చీఫ్ నవంబర్ 14 నంది పత్రిక ఎస్.రాయవరం మండలం కొత్త పోలవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడి విశాఖపట్నంలోని షీలానగర్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను హోం మంత్రి అనిత పరామర్శించారు. బాధితులకు ధైర్యం చెప్పి, వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎస్.రాయవరం మండలం కొత్త పోలవరం వద్ద ప్రమాదం జరిగిన స్థలాన్ని మంత్రి పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును, ప్రమాదానికి గల కారణాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. అక్కడి నుంచి నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న హోం మంత్రి అనిత, ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరమని పేర్కొంటూ, మృతుల కుటుంబాలకు మరోసారి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలని, వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హోం మంత్రి వంగలపూడి అనిత భరోసా ఇచ్చారు.

అడ్డురోడ్డు వద్ద రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మహిళలు మృతి ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. బైక్‌ను లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతులు నక్కపల్లి మండలం చినతీనార్లకు చెందిన వాసపల్లి నూకతల్లి, ఒరుపల్లి రత్నంగా గుర్తించారు. బైక్ నడుపుతున్న అల్లుడు ఒరుపుల నారాయణ గాయపడ్డారు. ఈ ఘటనపై కూడా హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన నారాయణకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.

బిలాంగింగ్ ఏ జర్నీఆఫ్ లవ్!

ఆత్మకథలో పార్టీకి సంబంధించిన అనేక కీలక ఘట్టాలను గుర్తుచేసుకున్నారు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ. అయితే చాలా ప్రశ్నలకు అందులో సమాధానాలు లభించలేదు. సిమ్లాలో 2003 జూలైలో జరిగిన కాంగ్రెస్ మేధోమథన సదస్సుకు సోనియాగాంధీ నేతృత్వం వహించారు. మరుసటి ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల కోసం పార్టీని సిద్ధం చేయడానికి ఈ సదస్సు జరిగింది. అక్కడ వాతావరణం ఉత్సాహంగా ఉంది. చర్చలు సాగుతున్నాయి. అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వాన్ని గద్దె దించాలంటే ప్రాంతీయ పార్టీలతో పొత్తు తప్పనిసరని నాయకత్వం గుర్తించడం మొదలుపెట్టింది. అదే సమయంలో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎవరు నాయకత్వం వహించాలనే విషయంపై పార్టీలోని కొందరు సీనియర్ నాయకులు చర్చిస్తున్నారని సోనియా గాంధీకి తెలిసింది. ఈ విషయం తెలిసి ఆమె ఆశ్చర్యపోయారు.

ఆమె ఐదేళ్లుగా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్నారు. దేశవ్యాప్తంగా పర్యటించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రతిపక్ష నాయకురాలిగా వ్యవహరించారు. పార్టీ నుంచి నాయకులు ఇతర పార్టీల్లోకి వెళ్లిపోవడం, ఎన్నికల్లో వరుస ఓటములు వంటి సమస్యలతో సతమతమవుతున్న కాంగ్రెస్‌ను మళ్లీ బలోపేతం చేసేందుకు సోనియా ప్రయత్నించారు.

అయినప్పటికీ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆమె నాయకత్వం వహించగల సామర్థ్యంపై పార్టీలో అంతర్గతంగా సందేహాలు కొనసాగాయి

సిమ్లా మేథోమథనంలో జరిగిన ఘటనను బిలాంగింగ్ లో సోనియా ప్రస్తావించారు.

నిర్ణయంపై గట్టిగా నిలబడడం

నవంబర్ 10న విడుదలైన బిలాంగింగ్ ఎ జర్నీ ఆఫ్ లవ్(హెచ్‌సీఐ)పుస్తకంలో ఈ విషయాన్ని ప్రస్తావించి సోనియా బాధపడ్డారు. రాజకీయ ప్రత్యర్థులు తన భారతీయతను ప్రశ్నించడం ఆమెకు అలవాటైపోయింది. కానీ సొంత పార్టీ నాయకులే తన సామర్థ్యంపై అనుమానం వ్యక్తం చేయడం మాత్రం పూర్తిగా భిన్నమైన విషయం.

దీనిపై సోనియా వెంటనే స్పందించారు. పుస్తకంలోని ఈ భాగం కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.

ఈ భాగంలో ఆమె ఇలా రాశారు.

నేను నా సహాయకుణ్ని పిలిచి సీనియర్లకు ఓ సందేశం పంపించాను. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నికల ప్రచారానికి నాయకత్వం వహించడం నా బాధ్యత. ఆ బాధ్యత నుంచి తప్పుకునే ఉద్దేశాలేమీ లేవు.

చివరకు నేను హాల్లోకి వెళ్లిన తర్వాత రాజకీయ తీర్మానాన్ని అందరికీ వినిపించేలా పెద్దగా చదివారు. అందులో పార్టీకి నేను నాయకత్వం వహిస్తాను. బీజేపీని ఓడించడానికి పొత్తులకు సిద్ధంగా ఉండాలి అనే విషయం స్పష్టంగా ఉంది అని సోనియా రాశారు.

ఆమె ఆత్మకథలో అత్యంత కీలకమైన అంశాల్లో ఇది ఒకటి. ఎందుకంటే రాజకీయాల్లోకి రావడానికి ఇష్టపడని వ్యక్తిగా, అధికారంపై పెద్దగా ఆసక్తి లేని మహిళగా ఆమె గురించి ఉన్న సాధారణ అభిప్రాయానికి ఇది విరుద్ధంగా ఉంది. ఆమెకు రాజకీయాలంటే ఆసక్తి లేకపోవడమన్నది నిజమే. కానీ ఒక్కసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తన స్థానానికి ఉన్న అధికారాలను ఉపయోగించాలనే సంకల్పం కూడా ఆమెకు బలంగా ఉంది.

రాజకీయాల్లోకి రావాలన్న కోరిక లేని ఆ మహిళ ఒక్కసారి బాధ్యతలు తీసుకున్న తర్వాత తనను పక్కన పెట్టడాన్ని మాత్రం అంగీకరించడానికి సిద్ధంగా లేరు.

ఈ వైరుధ్యం బిలాంగింగ్ పుస్తకం అంతటా కనిపిస్తుంది.

వ్యక్తిగత జీవితాన్ని గురించి బయటివారికి పెద్దగా తెలియనివ్వని ఒక మహిళ బలమైన రాజకీయ నాయకురాలిగా ఎలా మారారో కళ్లకు కట్టినట్టు చూపించడం ఈ పుస్తకం సాధించిన ఘనత. అయితే అయితే తన రాజకీయ నిర్ణయాల వల్ల కలిగిన పర్యవసానాలకంటే తన భావోద్వేగాల గురించి మాత్రమే సోనియా చాలా ఎక్కువగా వెల్లడించడం ఈ పుస్తకానికి ఉన్న ఓ పరిమితి.

ఈ ప్రశ్నలకు సోనియా ఆత్మకథ సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వడం లేదు.

ప్రజాస్వామ్య విలువల గురించి గర్వంగా చెప్పుకునే కాంగ్రెస్ ఈ ఘటన గురించి మరింత బహిరంగంగా మాట్లాడి ఉండాల్సింది.

కేసరిపై వ్యక్తిగతంగా గౌరవం చూపించడం వేరు. ఆయనను పదవి నుంచి తొలగించడం వెనుక ఉన్న రాజకీయ పరిణామాలను వివరించడం వేరు.

ఇందిర, రాజీవ్ గాంధీ హత్య తర్వాత తాను ఎదుర్కొన్న పరిస్థితులను పుస్తకంలో సోనియా వివరించారు.

అలా భావించడం బాధించింది.

సిమ్లాలో జరిగిన సంఘటన అంతకుముందు తనను తీవ్రంగా బాధించిన మరో తిరుగుబాటు ఘటనను సోనియాకు గుర్తుచేసి ఉండవచ్చు.

మేనల్లుడు సిద్ధార్థ్ గల్లా పెళ్లి.. వారణాసి షూటింగ్‌కు మహేశ్ బాబు విరామం?

సూపర్ స్టార్ మహేశ్ బాబు తన తాజా భారీ చిత్రం 'వారణాసి' షూటింగ్ నుంచి కొద్దిరోజుల పాటు చిన్న విరామం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. తన మేనల్లుడు సిద్ధార్థ్ గల్లా వివాహ వేడుకకు హాజరయ్యేందుకు ఆయన చిత్రీకరణకు తాత్కాలికంగా బ్రేక్ ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ మేరకు సోషల్ మీడియాలో వార్తలు విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి.

దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న 'వారణాసి' చిత్రంలో మహేశ్ బాబు ప్రస్తుతం నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. అయితే, కుటుంబంలో అత్యంత ముఖ్యమైన వేడుక జరగనుండటంతో మహేశ్ బాబు కొన్ని రోజుల పాటు షూటింగ్ పనులను పక్కనపెట్టి పెళ్లి వేడుకల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సిద్ధార్థ్ గల్లా పెళ్లికి సంబంధించిన ప్రీ-వెడ్డింగ్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహేశ్ బాబు అర్ధాంగి నమ్రతా శిరోద్కర్ ఈ వేడుకలకు సంబంధించిన ఫొటోలను ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా పంచుకున్నారు. దీంతో మహేశ్ బాబు కూడా త్వరలోనే ఈ వేడుకలకు హాజరవుతారన్న ప్రచారానికి బలం చేకూరింది.

ఇక 'వారణాసి' సినిమా విషయానికొస్తే, ఈ చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో మహేశ్ బాబు ఎద్దుపై కూర్చుని, చేతిలో త్రిశూలం పట్టుకున్న పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించి అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్నారు. ఈ సినిమాలో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌ను 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. వివాహ వేడుక పూర్తయిన వెంటనే మహేశ్ బాబు తిరిగి 'వారణాసి' సెట్స్‌లో జాయిన్ కానున్నట్లు తెలుస్తోంది.



ప్రెగ్నెన్సీ తొలి రోజులు చాలా కష్టం

గర్భం దాల్చినప్పటి కష్టాలపై కియారా ఎమోషనల్ కామెంట్స్

బాలీవుడ్ నటి కియారా అద్వానీ తన తొలి ప్రెగ్నెన్సీ సమయంలో ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. గర్భం దాల్చిన తొలి మూడు నెలలు చాలా కష్టంగా గడిచాయని, ఆ సమయంలో తన జీవితంలోని మహిళల మద్దతు ఎంతగానో కోరుకున్నానని గుర్తుచేసుకుంది. ప్రస్తుతం రెండోసారి గర్భవతిగా ఉన్న కియారా, గతంలో కరణ్ జోహార్ వ్యాఖ్యాతగా వ్యవహరించే 'కాఫీ విత్ కరణ్' షోలో ఈ వ్యాఖ్యలు చేసింది. తొలి ప్రెగ్నెన్సీ అనుభవాలను వివరిస్తూ "ఆ మొదటి మూడు నెలలు చాలా కఠినంగా గడిచాయి. వికారం, హార్మోన్ల మార్పులతో తీవ్రంగా ఇబ్బందిపడ్డాను. మొదట్లో ఈ విషయాన్ని ఎవరికీ చెప్పకూడదని నేను, నా భర్త సిద్ధార్థ్ అనుకున్నాం. కానీ, నాకు అప్పుడు మహిళల సపోర్ట్ అవసరమనిపించింది. వెంటనే సిద్ధార్థ్‌తో చెప్పాను.. 'లేదు సిద్, నేను మా అమ్మతో, అత్తగారితో మాట్లాడాలి. నన్ను అర్థం చేసుకునే మహిళలు నా జీవితంలో ఇప్పుడు కావాలి' అని అన్నాను" అని కియారా తెలిపింది. ఆ క్లిష్ట సమయంలో తన స్నేహితురాళ్లతో కలిసి కూర్చుని ఏడ్చేదానినని, వారు తనను ఓదార్చారని కియారా గుర్తుచేసుకుంది. మహిళల మధ్య ఉండే ఆ బంధం, ఒకరినొకరు అర్థం చేసుకునే గుణం తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని ఆమె వివరించింది. కాగా, కియారా అద్వానీ, సిద్ధార్థ్ మల్హోత్రా దంపతులకు ఈ ఏడాది మొదట్లో పాప (సారాయా) జన్మించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే, అక్టోబర్ 7న తాము రెండోసారి తల్లిదండ్రులు కాబోతున్నట్లు



సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. తమ కూతురు సారాయా చేతిలో చిన్నారి సాక్స్ ఉన్న ఫొటోను పంచుకుంటూ "మరోసారి దేవుడి గొప్ప బహుమతితో ఆశీర్వదించబడ్డాం. మా హృదయాలు ప్రేమ, కృతజ్ఞతతో నిండిపోయాయి" అని పోస్ట్ చేశారు.



న్యూ ఇయర్ కానుకగా వస్తున్న 'VISA వింటారా సరదాగా'



యంగ్ హీరో అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎXXX -- వింటారా సరదాగా' విడుదల తేదీ ఖరారైంది. నూతన సంవత్సర కానుకగా 2027 జనవరి 1న ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ప్రేమ, స్నేహం, వినోదం మేళవింపుగా రూపొందుతున్న ఈ చిత్రం యువతను విశేషంగా ఆకట్టు కుంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉద్భవ్ రఘు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా పూర్తిగా అమెరికా నేపథ్యంలో సాగుతుంది. ఉన్నత ఆశయాలతో విదేశాలకు వెళ్లిన తెలుగు విద్యార్థుల జీవితాలు, వారి జీవనశైలి, ఎదురయ్యే సవాళ్లు, స్నేహాలు, ప్రేమ ప్రయాణాల చుట్టూ ఈ కథనం నడుస్తుంది. విద్యార్థి దశలోని సరదా క్షణాలతో పాటు అనుకోని పరిస్థితులను హాస్యభరితంగా, ఆసక్తికరంగా దర్శకుడు తెరపై ఆవిష్కరించినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో రాహుల్ విజయ్, శివాత్మిక రాజశేఖర్, సత్య, వైవా హర్ష, గుండు సుద ర్శన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ ఎస్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకంపై సాయి సౌజన్య సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రానికి విజయ్ బుల్గా నిన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'అనగా అనగా అమెరికా', 'చింగారి' పాటలు శ్రోతల నుంచి మంచి ఆదరణ పొం దాయి. సంజిత్ హెగ్డే పాడిన పాట అమెరికా ప్రయా ణంలోని ఉత్సాహాన్ని ప్రతిబింబించగా, సిద్ శ్రీరామ్, లిప్సిక ఆలపించిన పాట ప్రేమలోని అనుభూతులను చక్కగా పలికించింది. ఇప్పటికే విడుదలైన రెండు టీజర్లు, హీరోహీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ సినిమాపై సానుకూల బజ్‌ను ఏర్పరిచాయి. 2027 నూతన సంవత్సరాన్ని పూర్తి స్థాయి వినో దంతో ప్రారంభించేందుకు ఈ చిత్రం సిద్ధ మవుతోంది.

డబుల్ సక్సెస్‌తో దిల్ రాజు.. పవన్‌తో మరో సినిమాపై కీలక ప్రకటన

ప్రముఖ నిర్మాత దిల్ రాజు ప్రస్తుతం రెట్టింపు ఉత్సాహంతో ఉన్నట్లు తెలిపారు. తాను పంపిణీ చేసిన రెండు సినిమాలు ఘనవిజయం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తన నిర్మాణ సంస్థ నుంచి రాబోయే చిత్రాల వివరాలను వెల్లడించాడు.దతెలుగు రాష్ట్రాల్లో తాము పంపిణీ చేసిన రణబీర్ కపూర్ 'రామాయణం' చిత్రం ఇప్పటికే రూ. 1000 కోట్ల వసూళ్ల మార్కును అధిగమించిందని, లాంగ్ రన్‌లో రూ. 2000 కోట్ల నెట్ సాధించే అవకాశం ఉందని దిల్ రాజు అంచనా వేశారు. అలాగే నైజాం ఏరియాలో విడుదల చేసిన సూర్య నటించిన 'సీన్' చిత్రం కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుందని, తక్కువ బడ్జెట్‌లోనూ బలమైన కథాంశంతో విజయం సాధించవచ్చని ఈ సినిమా నిరూపించిందని పేర్కొన్నాడు. ఈ రెండు విజయాలు తనకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయని ఆయన తెలిపాడు. ఈ సందర్భంగా తన కొత్త ప్రాజెక్టుల వివరాలను ఆయన వెల్లడించాడు. రవితేజతో రూపొందించనున్న చిత్రానికి 'వీరాధి వీరులంట' అనే టైటిల్ ఖరారు చేశామని, ఫిబ్రవరి నుంచి చిత్రీకరణ ప్రారంభం కానుందని పేర్కొన్నాడు. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ హీరోగా పరిచయమవుతున్న 'ఎల్లమ్మ'తో పాటు విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న 'రౌడీ జనార్దన' చిత్రాలను వచ్చే వేసవిలో విడుదల చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలిపాడు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com